ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
3
శుక్రవారం 6 డిసెంబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ :18004251442

యాదాద్రి :1800 425 7106

సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.127	208	238
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 19.4






ఎయిమ్స్



ఐటీ హబ్



బస్వాపూర్ రిజర్వాయర్

నియోజకవర్గం సమస్యల దుర్గం

▸ ఏడాది పూర్తయిన కాంగ్రెస్ పాలన

▸ హామీల అమలుకు ప్రజల విన్నపం

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనకు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న పలు ప్రధాన సమస్యల పరిష్కారానికి, కీలక ప్రాజెక్టులకు సీఎం నిధులివ్వాలని ప్రజలు ఆశిస్తున్నారు. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతుభరోసా, పింఛన్ల పెంపు, నియోజకవర్గానికో డిగ్రీ కళాశాల, మండలానికి ఓ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాల ని డిమాండ్ చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



ఉమ్మడి జిల్లాలో పరిశ్రమలు అధికంగా ఉండడం, కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్న నేపథ్యంలో నార్కట్‌పల్లి సమీపంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. మిర్యాలగూడలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఉన్నా సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పూర్తిస్థాయి ఆసుపత్రిని ఏర్పాటు చేస్తే కార్మికులకు, వారి కుటుంబాలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

పెండింగ్ రుణమాఫీని పూర్తిచేయాలి

రుణమాఫీ పథకం అమలులో భాగంగా బ్యాంకుల్లో సాంకేతిక కారణాలతో పలువురు రైతులకు మాఫీ వర్తించలేదు. ఈ పెండింగ్ రుణమాఫీ పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. పట్టాదా రు పాస్‌పుస్తకం, బ్యాంక్ అకౌంట్‌లో తప్పులు, కుటుంబం ఫొటో లేదని, జాయింట్ అకౌంట్ వంటి పలు సాంకేతికకార ణాలతో చా లామంది రైతులకు అర్హత ఉన్నా రుణమాఫీ పొందలేకపోయారు. ఇలాంటి కేసులన్నింటినీ పునఃపరిశీలించి రుణ మాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

పెండింగ్ పనులపై దృష్టిసారించాలి

నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి ఇటీవల రూ.44కోట్లతో మంజూరైన మూడు ఎత్తిపోతల పథకాల పనులను వేగంగా పూర్తిచేసి, వచ్చే వానాకాలానికి నీరివ్వాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు లైనింగ్‌కు నిధులివ్వాలని, తద్వారా అన్ని డిస్ట్రిబ్యూటరీలకు నీరంది రైతులకు రెండు పంటలు పండించుకునేందుకు ఇబ్బంది ఉండదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా నల్లగొండ పట్టణంలో కళాభారతి నిర్మాణాన్ని చేపట్టాలని, ఐటీ హబ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, ఎంజీయూలో టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరుతున్నారు. బత్తాయి మార్కెట్, పట్టణంలోని సమీకృత మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, పట్టణ సమీపంలో బైపాస్‌పై నిర్మిస్తున్న ఓవర్‌బ్రిడ్జిని తక్షణమే పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

● మునుగోడు నియోజకవర్గంలో రీజనల్ రింగురోడ్డు కింద భూనిర్వాసితులకు పరిహారం పెంచాలని కోరుతున్నారు. నియోజకవర్గానికి సాగు, తాగునీటిని అందించే డిండి ఎత్తిపోతల పథకం పనులు వేగంగా పూర్తిచేసి ఫ్లోరైడ్ పీడను విరగడ చేయాలని కోరుతున్నారు. చండూరులో ఏర్పాటైన రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి రెగ్యులర్ ఉద్యోగులను కేటాయించడంతో పాటు, డివిజన్‌ను అమలులోకి తీసుకురావాలని, 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. చౌటుప్పల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.

● నకిరేకల్ నియోజకవర్గంలో.. నియోజకవర్గానికి సాగునీటి ఆధారమైన మూసీ కాల్వలు పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలకు పూర్తికి నిధులివ్వాలని కోరుతున్నారు. అయిటిపాముల ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో అర్ధాంతరంగా నిలిచిన వంద పడకల ఆసుపత్రి భవనాన్ని పూర్తిచేయాలని, నార్కట్‌పల్లి బస్‌డిపో బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చెర్వుగట్టు ఆలయానికి రెండో ఘాట్‌రోడ్డును నిర్మించేందుకు నిధులివ్వాలని విన్నవిస్తున్నారు. రామన్నపేటలో నిర్మించతలపెట్టిన అంబూజా సిమెంట్ పరిశ్రమను ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు.

● మిర్యాలగూడ నియోజకవర్గంలో.. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఐదు ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజరు చేసి వాటిని

మిగతా 4వ పేజీలో



లక్షమందితో సీఎం బహిరంగ సభ

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నల్లగొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాది నిండుతున్న సందర్భంగా జిల్లా కేంద్రం సమీపంలో ఎస్ఎల్‌బీసీ వద్ద ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల పక్కన లక్ష మందితో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నిర్వహిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈనెల 7న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల నిమిత్తం రానుండగా, ఏర్పాట్లను మంత్రి గురువారం పరిశీలించారు. వైద్య కళాశాల నూతన భవనాల వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం పర్యటనలో భాగంగా సుమారు రూ.1000కోట్లతో చేపట్టిన బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ చానల్స్ ప్రారంభిస్తారని తెలిపారు. 2008లో వైఎస్ హయాంలో ఈ పనులు మంజూరు కాగా, 80శాతం పూర్తయ్యాయని, గత ప్రభుత్వం ఈ పనులను పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు పూర్తిచేశామని తెలిపారు. బ్రాహ్మణవెల్లెంల ద్వారా సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని, భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ పనులకు సైతం సీఎం రూ.4,540కోట్లు మంజూరు చేశారని, అమెరికా నుంచి బోరింగ్ యంత్రం పరికరాలు రానున్నాయని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పూర్తయితే 4,000 నుంచి 6,000 క్యూసెక్కుల నీటితో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సీఎం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో యూనిట్-2లో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి ఎస్ఎల్‌బీసీ గంధంవారిగూడెం వద్ద రూ.275కోట్లతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడే రూ.40కోట్లతో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన చేస్తారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించి, గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని, కనగల్, తిప్పర్తి మండలాలకు మంజూరైన జూనియర్ కళాశాలకు కూడా శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే నార్కెట్‌పల్లి, దామరచర్ల మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరు చేస్తూ డిసెంబరు 9 తర్వాత జీవో రానుందని వెల్లడించారు. ఎల్లారెడ్డిగూడెం వద్ద రూ.10కోట్లతో టూరిజం ద్వారా హరిత హోటల్ నిర్మిస్తున్నామన్నారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసాను సీఎం ప్రకటించనున్నారని.....

- మిగతా 4వ పేజీలో...

నేడు జిల్లాకు

మంత్రుల రాక 4

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా

చర్యలు తీసుకోవాలి 4

మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ

మెడికల్ కళాశాల వద్ద

బీఆర్ఎస్ నేతల అరెస్ట్

గత ప్రభుత్వ పనులు కొనసాగించాలి : కంచర్ల

తూనికలు, కొలతలపై అవగాహన ఉండాలి

లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సిద్దార్థ్




తూనికలు, కొలతపై అవగాహన కల్పిస్తున్న సిద్దార్థ్

నల్లగొండ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలపై అవగాహన ఉండాలని, మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని లీగల్ మెట్రాలజీ నల్లగొండ జోన్ అసిస్టెంట్ కంట్రోలర్ కె.సిద్దార్థ్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు ఉపయోగించే తూకపు రాళ్లు, యంత్రాల ద్వారా ఎలా మోసాలకు పాల్పడుతున్నారో వివరించారు. ఆహార పదార్థాల ప్యాకెట్లపై తయారీదారుడి చిరునామా, బరువు, ప్యాక్ చేసిన తేదీ, గరిష్ఠ ధర, కస్టమర్‌కేర్ చిరునామా ముద్రించి ఉండాలన్నారు. తూకాల్లో మోసాలపై వినియోగదారులు 9440575081 నెంబర్‌కు ఫిర్యాదు చేయలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారి పి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులు, పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



పంటను పరిశీలించి మహిళా రైతుతో మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్

మర్రిగూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు పంట భూముల భూసార పరీక్ష చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ మృత్తికా (నేల) దినోత్సవం సందర్భంగా మండలంలోని రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు భూసార పరీక్షలు చేయించుకొని పచ్చిరొట్ట ఎరువులు, పశువుల పేడ, ఇతర సేంద్రీయ ఎరువులను ఉపయోగిస్తూ భూసారాన్ని పెంచాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని కోరారు. మర్రిగూడ, తమడపల్లి గ్రామాల్లో రైతుల వ్యవసాయ భూముల వద్దకు వెళ్లి మట్టి నమునాలు ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. యాసంగిలో సాగుచేయాల్సిన పంటలపై రైతులతో చర్చించారు. ఆయన వెంట ఏవో పి.మల్లేష్, ఏఈవో పి.విజయ్‌కుమార్, నాగస్వాతి, తదితరులు ఉన్నారు.

నేడు చీఫ్ మినిస్టర్ కప్ కోఆర్డినేషన్ మీటింగ్

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చీఫ్ మినిస్టర్ కప్ కోఆర్డినేషన్ సమావేశం శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో సాయంత్రం 3గంటలకు నిర్వహించనున్నట్టు డీఎస్‌వైవో కుంభ నర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయ, అంతర్జాతీ క్రీడల్లో రాణించేలా గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను ఎంపిక చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఈ టోర్నమెంట్‌కు సంబంధించి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశామని, ఒలంపిక్స్ అసోసియేషన్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

యాసంగికి ప్రణాళికలు

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలకు అధికారుల సన్నాహాలు

డిసెంబరు 10 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 15 వరకు

వారబందీ పద్ధతిలోనే నీటి విడుదల ఉంటుందన్న ఎన్నెస్పీ అధికారులు

యాసంగి సాగుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం జిల్లాలోని ప్రాజెక్టుల ద్వారా నీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులైన నాగార్జున సాగర్, మూసీల నుంచి నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. డిసెంబరు 10వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు వారబందీ పద్ధతిలో నీటి విడుదల ఉంటుందని నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ అధికారులు పేర్కొంటున్నారు. మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో యాసంగి సాగుకు నీటిని అందించేందుకు ప్రణాళికను అధికారులు ఖరారుచేశారు. ఈ నెల మూడోవారం నుంచి ప్రాజెక్టు పరిధిలోని 30వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించనున్నారు. ఆన్ ఆఫ్ పద్ధతిలో వచ్చే ఏడాది ఏప్రిల్ రెండో వారం వరకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. 5



రైతు భరోసాను విడుదల చేయాలి

మంత్రి తుమ్మలకు డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి



మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు వెంటనే రైతుభరోసా నిధులు విడుదల చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు రైతుభరోసాగా ఎకరాకు రూ.7500 చొప్పున ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించడంతో రైతులంతా ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఈ నిధులను త్వరితగతిన విడుదలకు కృషి చేయాలని కోరారు. సంక్రాంతి తరువాత రైతు భరోసా అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారన్నారు. ఈ నిధులు విడుదల అయితే రైతులకు పెట్టుబడి సాయంగా ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద మొత్తంలో రుణమాఫీ జరిగిందని, సహకార బ్యాంకుల్లోని రైతుల రుణాలు కూడా మాఫీ చేయడం సంతోషకరమన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

పసి ప్రాణం తీసిన 'పంచాయితీ'

● భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు

● భర్తపై కోపంతో కుమారుడిని బావిలోకి తోసి దూకిన తల్లి

● బాలుడు మృతి.. తల్లిని రక్షించిన స్థానికులు 5

వలపు వల కిలేడీ కోసం వెతుకులాట

డీ-8, 9 ఎత్తిపోతల ట్రయల్ రన్ విజయవంతం



ఎత్తిపోతల ట్రయల్ రన్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ లోలెవల్ కెనాల్ ద్వారా డీ-8, 9 కాల్వలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ విజయవంతమైంది. గురువారం నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజనీర్లతో కలిసి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ఈ ట్రయల్‌రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు కాల్వల్లో పారుతున్న సాగునీటిని పరిశీలించారు. ఈ నెల చివరి నాటికి ఈ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించి సుమారు 7,150 ఎకరాలకు సాగునీటిని అందిస్తామని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనులు నిలిచిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే విజయవంతంగా పనులు పూర్తి చేశామన్నారు. ఈ పథకం ద్వారా కుంకుడుచెట్టుతండా, గాత్‌తండా, తూటిపేటతండా, పాశంవారిగూడెం, రంగుండ్ల, జానారెడ్డికాలనీ, ఎల్లాపురంతండా గ్రామాలకు సాగునీరు అందజేయనున్నట్టు తెలిపారు. వారి వెంట డీఈలు నాగయ్య, వేణు, ఏఈఈలు రవిరాజా, ఖదీర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, నాయకులు పగడాల నాగరాజు, మెరావత్ మునినాయక్, అనుముల అంజి, లాలునాయక్, కుర్ర శంకర్‌నాయక్, భాస్కర్‌నాయక్, బాలునాయక్, సర్దార్‌నాయక్, చందు, పాండునాయక్, శంకర్‌నాయక్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

దేవరకొండ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అనిత


దేవరకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దేవరకొండ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత అధికారులను ఆదేశించారు. దేవరకొండ పట్టణ శివారు పెంచికల్‌పహాడ్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న దేవరకొండ మున్సిఫ్‌కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అనిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రవీందర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి హరీష్‌బాబు గురువారం రాత్రి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న భోజనం వివరాలను విద్యార్థులతోపాటు వసతి గృహ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, స్టోర్‌రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత

శరవేగంగా బంగారు తాపడం పనులు

● యాదాద్రి బ్రహ్మోత్సవాలకు మిగిలింది 84 రోజులే


బంగారు తాపడంతో దివ్య విమాన రాజ గోపురం నమూనా (ఫైల్)

భువనగిరి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య విమాన రాజగోపురానికి బంగారు తొడుగుల (తాపడం)పనులు శరవేగంగా సాగుతున్నాయి. చెన్నైకి చెందిన మెసర్స్ స్మార్ట్ క్రియేషన్ సంస్థకు గురువారం 8.645 కిలోల బంగారాన్ని అప్పగించినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. మొత్తం 10,000 చదరపు అడుగులకు ఇప్పటివరకు 3,300 చదరపు అడుగుల మేర బంగారు పూత రేకులు ఆలయానికి చేరాయి. ఇంకా 6,700 చదరపు అడుగుల బంగారు రేకులు రావాల్సి ఉంది. బంగారు తొడుగులకోసం 60కిలోల బంగారం అవసరం కాగా, ఇప్పటివరకు సుమారు 30కిలోల బంగారం చెన్నై సంస్థకు అప్పగించినట్లు తెలిసింది. మిగతా బంగారం విడతలవారీగా అప్పగించనున్నారు.

భక్తుల నుంచి విరాళాల ద్వారా..

యాదగిరీశుడి భక్తుల నుంచి విరాళాల ద్వారా సమకూరిన 10.5 కిలోలు బంగారం, రూ.20కోట్ల నగదుతో 26 కిలోలు కొనుగోలు చేసిన అధికారులు దేవస్థానానికి చెందిన 13గోల్డ్‌బాండ్లతో 2కిలోలు, 776 కిలోల వెండిని బంగారంగా మార్చి వినియోగిస్తున్నారు. భక్తులనుంచి విరాళాల ద్వారా సేకరించబోయే నగదును వినియోగించాలని గత సెప్టెంబరు 27న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బంగారు తాపడం పనులు నవంబరు 6న కళావరోహణతో ప్రారంభించగా, 2025 మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఇంకా 84 రోజుల గడువు ఉంది. ఆలోగా తాపడం పనులు పూర్తిచేసేందుకు అధికారులు వేగవంతం చేశారు. మహా కుంభాభిషేకం చేపట్టిన తర్వాత వార్షిక బ్రహోత్సవాలు నిర్వహించాల్సి ఉన్నందున సంకల్పం నెరవేర్చేందుకు ఈవో కృషి చేస్తున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి దివ్యక్షేత్రంలో గురువారం నిత్యకైంకర్యాలు అత్యంత వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి గజవాహన సేవలో తీర్చిదిద్దారు. సేవోత్సవం అనంతరం ఉత్సవమూర్తులకు కల్యాణమండపంలో కల్యాణతంతు కొనసాగింది. అంతకుముందు ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,73,144 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. లక్ష్మీనృసింహుడిని దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ కుటుంబసమేతంగా దర్శించుకుని స్వామివారి అభిషేక పూజల్లో పాల్గొన్నారు.

మాపై కనికరం చూపండి

ఆంధ్రజ్యోతి జన వాక్యం

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా అధికారంలోకి రాగానే మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. ఇది ఆటో కార్మికుల ఉపాధిపై తీవ్రప్రభావం చూపిస్తోంది. నిరుద్యోగులు, ఇతరరంగాల్లో ఉపాధి దొరకని యువకులు, డ్రైవర్లు కుటుంబ పోషణ కోసం ఆటోలు నడుపుకుంటూ కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. మరికొందరు ట్రాన్స్‌పోర్టు ట్రాలీ ఆటోలు నడుపుతుండగా, మరికొందరు పట్టణాలను వివిధ గ్రామాలకు ప్యాసింజర్ ఆటోలు నడుపుతున్నారు. వీరిలో అనేకులు పేదలే. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ప్యాసింజర్ ఆటోడ్రైవర్ల జీవితాలపై పెనుప్రభావం చూపుతుందంటున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తమను ఆదుకోవాలని, జేఏసీ డిమాండ్లపై చర్చించని పక్షంలో 7న రాష్ట్రవ్యాప్త సమ్మె కొనసాగిస్తామని ఆటో డ్రైవర్లు హెచ్చరిస్తున్నారు.

● (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

ప్రభుత్వం ఆదుకోవాలి



ఇంటర్ వరకు చదివా. ఏ ఉద్యోగం దొరకలేదు. 16ఏళ్లుగా ప్యాసింజర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నా. గతంలో రోజువారి డీజిల్ ఖర్చులు పోను రూ.500 మిగిలేవి. ప్రస్తుతం రూ.200 కూడా మిగలటం లేదు. సెలవు రోజుల్లో డీజిల్ ఖర్చులే మిగులుతున్నాయి. దీంతో కుటుంబ నిర్వహణ కష్టంగా మారింది. ఆటోలో పోసే డీజిల్ నుంచి అన్ని నిత్యావసరాల ధరలు పెరుగుతుండగా మా ఆదాయం పూర్తిగా తగ్గింది. ప్రభుత్వం సరైన మార్గం ఆలోచించి ఆటో కార్మికులను ఆదుకోవాలి.

మదార్ హుస్సేన్, త్రిపురారం

సీరియల్‌లో ఒక్క ట్రిప్పే వస్తోంది



నేరేడుచర్ల- మిర్యాలగూడకు ఆటో సీరియల్‌లో పెడితే గతంలో రోజుకు మూడు ట్రిప్పులు పడేవి. ప్రస్తుతం ఒక్క ట్రిప్పుకే పరిమితమయ్యాం. ఉదయం వచ్చి సాయంత్రం వరకు అడ్డాపై కూర్చోవడం తప్ప చేసేదేమీ లేదు. ఇద్దరు పిల్లల చదువుకు ఫీజులు కట్టాలంటే ఇబ్బందిపడాల్సి వస్తోంది. మాకు న్యాయం చేయాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చాం. ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఉపేక్షిస్తే ఆటోలు బంద్ పెట్టి నిరసన తెలుపుతాం.

నర్సింగ్ వెంకటేశ్, నేరేడుచర్ల

నష్టపోయిన డ్రైవర్లను ఆదుకోవాలి



20 ఏళ్లుగా ఆటో నడుపుతూ భార్యాపిల్లలను పోషిస్తున్నా. మిర్యాలగూడ నుంచి తిప్పర్తి మార్గంలో ప్యాసింజర్ ఆటో నడుపుతా. వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణతో పాటు పిల్లలను చదవిస్తున్నా. ఉచిత బస్సు పథకం మా ఆదాయాన్ని దెబ్బతీసింది. బస్టాండ్ ముందు, బస్టాపుల వద్ద ప్యాసింజర్ కోసం ఆపితే ఆర్టీసీ వారు ఎంవీఐలు దండుగలు రాస్తున్నారు. కనీసం ఆటో కాగితాలకు, ఫిటినెస్ ఖర్చుల కోసం ప్రభుత్వం రూ.15 వేలు ఇవ్వాలి. ఆటో కార్మికుల కుటుంబాలకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలి. లేదంటే 7న జరిగే బంద్‌లో పాల్గొంటాం.

సయ్యద్ ఇస్మాయిల్, కుక్కడం

నియోజకవర్గం.. సమస్యల దుర్గం

(3వ పేజీ తరువాయి)

పూర్తిచేయించాలని కోరుతున్నారు. అదేవిధంగా నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై నిర్మించతలపెట్టిన నాలుగు అండర్‌పాస్ బ్రిడ్జిలను తక్షణం నిధులిచ్చి పనులు పూర్తిచేయించాలని కోరుతున్నారు. పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. యాదాద్రి థర్మల్‌పవర్ ప్లాంట్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాలకు ఉద్యోగాలిస్తామన్న హామీని అమలు చేయాలని కోరుతున్నారు.

● నాగార్జునసాగర్ నియోజకవర్గంలో.. నాగార్జునసాగర్ కృష్ణపట్టె గ్రామాలకు సాగునీరందించే నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, నాగార్జునసాగర్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులివ్వాలని కోరుతున్నారు.

● సూర్యాపేట నియోజకవర్గంలో.. నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, టూరిజంశాఖ ఆధ్వర్యంలో ఫుడ్‌కోర్టు, నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

● హుజూర్‌నగర్ నియోజవర్గంలో.. ఇప్పటికే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో రూ.80కోట్లతో కొనసాగుతున్న మోడల్ కాలనీ పనులను వెంటనే పూర్తిచేయాలని కోరుతున్నారు. అదేవిధంగా ఏటీసీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయించాలని, డిగ్రీ, ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మినీ స్టేడియం ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని ఆశిస్తున్నారు.

● కోదాడ నియోజకవర్గంలో.. కోదాడకు మంజూరైన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● తుంగతుర్తి నియోజకవర్గంలో.. బేస్‌మెంట్ స్థాయి వద్ద నిలిచిన 100 పడకల ఆసుపత్రిని భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు. తుంగతుర్తి, మోత్కూరు మండల కేంద్రాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తుంగతుర్తిలో ఫైర్‌స్టేషన్, ఎస్సారెస్పీ కాల్వ ఆధునికీకరణ, పారిశ్రామికవాడ, రుద్రమచెరువు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని, మోత్కూరులో 30పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని, ఆర్టీసీ డిపో, సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.

● ఆలేరు నియోజవర్గంలో.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ డివిజన్ చేయాలని, ఆలేరు పెద్దవాగుపై వంతెన విస్తరణ చేపట్టాలని, అండర్‌పాస్ అసంపూర్తిగా ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిందని, ఆలేరు పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణాను కట్టడి చేయాలని, గంధమళ్ల రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని, నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

● భువనగిరి నియోజకవర్గం.. కాళేశ్వరంలో భాగమైన బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపు బాధితులకు పరిహారమివ్వాలని, బునాదిగాని కాల్వ, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల నిధులు మంజూరు చేసి పనులు వేగంగా పూర్తిచేయాలని, బీబీనగర్ ఎయిమ్స్‌లో అన్ని రకాల విభాగాల్లో ఇన్‌పేషంట్ సేవలు ప్రారంభించేందుకు సీఎం చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

● దేవరకొండ ప్రభుత్వాసుపత్రిని ప్రస్తుతం 100 పడకల నుంచి 200 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నక్కలగండి రిజర్వాయర్‌లో నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని, పునరావాసం కల్పించాలని, పట్టణంలోని వెజన్, నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని, దేవరకొండలో ఆర్డీఏ కార్యాలయం ఏర్పాటుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతున్నారు.

లక్ష మందితో సీఎం బహిరంగ సభ

(3వ పేజీ తరువాయి)

తెలిపారు. వచ్చే నెలలో మూసీ ప్రక్షాళనకు రూ.25వేల కోట్లతో టెండర్లు పిలిచి దశలవారీగా పనులు చేపడతామన్నారు. సీఎం బహిరంగ సభకు ప్రజలు తరలిచివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ రాములునాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

బీజేపీ నేతలది ద్వంద్వ వైఖరి.. బీఆర్ఎస్‌ది అవగాహన లేమి

నార్కట్‌పల్లి: ఓ వైపు ఫ్లోరైడ్, మరోవైపు కలుషిత మూసీ నీటితో జిల్లా ప్రజలు బాధపడుతున్న ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించాల్సిన బీజేపీ ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 7న మండలంలోని బీ.వెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీఎల్ఆర్‌లతో కలిసి మంత్రి గురువారం పరిశీలించారు. హెలీప్యాడ్, సీఎం ఆవిష్కరించే పైలాన్, ఫొటో గ్యాలరీ తదితర పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రూ.30,000కోట్లతో ప్రధాని మోదీ నమామీ గంగ పేరుతో శుద్ధీకరణ చేస్తే తప్పులేదు గాని, తమ ప్రభుత్వం మూసీ నదిని ప్రక్షాళన చేస్తుందంటే బీజేపీ నేతలు విమర్శించడం, మూసీ నిద్రలు చేయడం అర్థరహితమన్నారు. ఇక బీఆర్ఎస్ నేతలకు మూసీ ప్రక్షాళనపై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. బీ.వెల్లెంల ప్రాజెక్టును జాతికి అంకితం చేసే కార్యక్రమంతో తన జీవితం ధన్యమైనట్టేనన్నారు. నల్లగొండలో జరిగే బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మంత్రి వెంట ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, ఈఈ గంగం శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, నాయకులు బత్తుల ఊశయ్య, దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, బండా సాగర్‌రెడ్డి, సట్టు సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొడిగె స్వామి, ప్రజ్ఞాపురం సత్తి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేశ్, ఆర్ఐ తరుణ్, యెల్లెందుల కిట్టు, బొడిగె నర్సింహ, చిరుమర్తి ధర్మయ్య, ఉన్నారు.


బీ.వెల్లెంలలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చూడాలి:ఐజీ

నార్కట్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ అన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఉదయసముద్రం వద్ద హెలీప్యాడ్, పైలాన్, రిజర్వాయర్లను ఆయన పరిశీలించి, బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా పోలీస్ అధికారులతో చర్చించారు. ఐజీ వెంట అదనపు ఎస్పీ రాములునాయక్, ఎస్పీ డీఎస్పీ రమేశ్, డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు ఉన్నారు.

నేడు నల్లగొండ జిల్లాకు మంత్రులు రాక

నల్లగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలో ఈనెల 7న సీఎం రేవంత్ పర్యటనను పురస్కరించుకొని శుక్రవారం జిల్లాకు మంత్రులు రానున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు జిల్లాలో పర్యటించనున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 10గంటలకు ఎన్‌జీ కళాశాలకు చేరుకుంటారు. ఆ తర్వాత బ్రాహ్మణవెల్లెంలకు వెళ్తారు. అనంతరం తిరిగి వచ్చి హెలికాప్టర్ ద్వారా యాదాద్రి పవర్ ప్లాంట్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు ప్రయాణమవుతారు.

మెడికల్ కళాశాల వద్ద బీఆర్ఎస్ శ్రేణుల అరెస్టు

నల్లగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల నూతన భవనాల వద్ద మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం కోసం యత్నించిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 7న మెడికల్ కళాశాలను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసేందుకు నాయకులు గురువారం మెడికల్ కళాశాల వద్దకు వెళ్లారు. అప్పటి సీఎం కేసీఆర్ మెడికల్ కళాశాలను మంజూరు చేశారని, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కృషితో రూ.125కోట్లతో భవనాలు పూర్తయ్యాయని పేర్కొంటూ బీఆర్ఎస్ శ్రేణులు కృతజ్ఞత పూర్వకంగా కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలని యత్నించగా, పోలీసులు అడ్డుకొని అరెస్ట్‌చేశారు. ఈ ఘటనను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఖండించారు. తమ హయాంలో మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసిన భవనం వద్ద కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తే తప్పేంటని ప్రశ్నించారు.కాగా, పోలీసులు మారగోని గణేష్, మెరుగు గోపి, సత్తయ్య, వెంకట్‌రెడ్డి, రమేష్, అమర్, శ్రీనివాస్, రాంరెడ్డి, రఫీ, గణేష్, పరమేష్‌లను స్టేషన్‌కు తరలించి ఆ తరువాత వదిలేశారు.

గత ప్రభుత్వ పనులను కొనసాగించాలి

నల్లగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో నాటి సీఎం కేసీఆర్ నల్లగొండకు మంజూరు చేసిన పనలను యథావిధిగా కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. 20 ఏళ్లుగా వెనుకబడిన నల్లగొండ నియోజకవర్గానికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి సహకారంతో నిధులు మంజూరు చేయించి ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. నాడు మంజూరు చేసిన నిధులను ప్రస్తుతం వేరే పనులకు మళ్లించినట్లుగా తెలుస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడే ఈ పనులను కొనసాగించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని సూపర్‌స్పెషాలిటీగా మార్చడానికి రూ.250కోట్లు కేటాయించాలన్నారు. ఏఎమ్మార్పీ కాల్వల వెడల్పుకు రూ.1,500కోట్లు, నల్లగొండ సమగ్రాభివృద్ధికి రూ.250కోట్లు, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుకు అదనంగా రూ.500కోట్లు, నల్లగొండ నియోజకవర్గంలోని పల్లెల అభివృద్ధికి రూ.100కోట్లు కేటాయించాలని కోరారు.

ఆధునికం..అవకాశాలు ఘనం

● అడ్వాన్స్ ట్రైనింగ్ కేంద్రాలుగా ప్రభుత్వ ఐటీఐలు

● డిండిలో ఈ ఏడాది నుంచే శిక్షణ షురూ


అడ్వాన్స్ టెక్నాలజీ కోసం చేపడుతున్న ఏర్పాట్లు

డిండి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐ సెంటర్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఐటీసీ కేంద్రాలుగా మారుస్తోంది. ఇందులో భాగంగా ఈ విద్యాసంవత్సరం నుంచే నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో అడ్వాన్స్ ట్రైనింగ్ కోర్సులను టాటా టెక్నాలజీ సహకారంతో నూతన కోర్సులను ప్రవేశపెట్టారు. సాంప్రదాయంగా వస్తున్న కోర్సులతో పాటుగా నూతనంగా అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇచ్చి విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించనున్నారు. ఇదిలా ఉండగా అక్టోబరులో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించారు. ప్రవేశాలు పొందిన వారు శిక్షణ అనంతరం స్వయంఉపాధితో పాటు టాటా సంస్థలలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) నిధులు రూ.4 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అదేవిధంగా యంత్రాల కొనుగోలుకు రూ.7 కోట్లు కేటాయించారు. ఇందులో ఉపకరణాలు కొనుగోలుకు టాటా సంస్థ వాటా 85శాతం కాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు 15శాతం తనవాటాగా నిధులను కేటాయించింది. టాటా సంస్థ ఎంపికచేసిన ఉద్యోగులు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైన ఆరు నూతన కోర్సులలో పదో తరగతి ఉత్తీర్ణులైన 172మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ఇప్పటికే డిండి ఐటీఐలో 100శాతం సీట్లు భర్తీ అయినట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తెలిపారు.

కోర్సులు	కాల వ్యవధి
మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమిషన్	ఏడాది
ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్	ఏడాది
ఆర్టిజన్ యూసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్	ఏడాది
బేసిక్ డిజైన్, వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్)	రెండేళ్లు
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మ్యాచింగ్ టెక్నీషియన్	రెండేళ్లు
ఎలక్ట్రికల్ వెహికల్ మెకానిక్	రెండేళ్లు

గ్రామీణ విద్యార్థులకు ఎంతో ఉపయోగం



గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానాన్ని నేర్పించే ఐటీసీ కేంద్రాలు ఎంతోఉపయోగం. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. శిక్షణ పొందిన వారు ఉద్యోగం వద్దనుకుంటే స్వయం ఉపాధికి కూడా ప్రభుత్వం సహకరిస్తుంది. మౌలిక వసతుల ఏర్పాట్లలో భాగంగా కొత్త షెడ్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

రాధాకృష్ణ, ఐటీఐ ప్రిన్సిపాల్

శిక్షణ పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు



ఐటీఐలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన కోర్సులలో శిక్షణ పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఈ కోర్సులు ఎంతో ఉపయోగపడుతాయి. కోర్సులలో ఉత్తీర్ణత పొందినవారికి ప్రతిభ ఆధారంగా టాటా సంస్థ ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. నేను ఒక సంవత్సరం కోర్సు రోబోటిక్‌లో శిక్షణ పొందుతున్నా.

బలమూరి సాయి, విద్యార్థి

ప్రశాంతంగా ముగిసిన జీఎన్ఎం పరీక్షలు

నల్లగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత 10 రోజులుగా జరుగుతున్న జనరల్ నర్సింగ్ మెడిసిన్(జీఎన్ఎం) పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిసినట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 25న ప్రారంభమైన పరీక్షలు ఈ నెల 5వ తేదీతో పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.రాధాకృష్ణ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు.పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన సిబ్బందికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆలేరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఆలేరులో జరిగిన 68వ పాఠశాల క్రీడల్లో అండర్-14 విభాగంలో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి విద్యార్థి ఆలకుంట్ల వైష్ణవి, మొరిగాడి కీర్తశ్రీ, 8వ తరగతి విద్యార్థులు చెరుకూరి మహేందర్, గౌతమ్ సోలంకిలు ఎంపికయ్యారన్నారు. ఈ నెల వనపర్తిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

'రివర్సబుల్ పంపింగ్' అడ్డంకులపై డ్రోన్ సర్వే

నాగార్జునసాగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో రివర్సబుల్ పంపింగ్ (విద్యుదుత్పత్తి) సమయంలో ఏర్పడే అడ్డంకులను తెలుసుకునేందుకు జెన్‌కో ఆధ్వర్యంలో కేంద్ర సర్వే సంస్థ గురువారం డ్రోన్ సర్వే ప్రారంభించింది. రివర్సబుల్ పంపింగ్ సమయంలో విద్యుదుత్పత్తి చేయడానికి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ముందున్న నీరు అవసరమైనంతగా అందటం లేదని, టర్బైన్ల పనితీరుపై ఆ ప్రభావం పడుతోందని సర్వే నిర్వహిస్తున్నట్లు జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు. డిసెంబరు 3 నుంచి వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ వరకు నెల రోజుల పాటు సర్వే కొనసాగుతుందన్నారు. రెండు రోజుల క్రితమే సర్వే ప్రారంభించాల్సి ఉండగా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గురువారం డ్రోన్ సర్వే ప్రారంభించినట్లు తెలిపారు.

21కిలోమీటర్ల మేర సర్వే

ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 21కిలోమీటర్ల దూరంలో ఉన్న టెయిల్‌పాండ్ వరకు నీటి లభ్యత, నీటిలో మట్టి, రాళ్లు, కంకర, గుట్టలు ఎంత మేరకు ఉన్నాయో తెలుసుకుని వాటిని తొలగించడానికి చెన్నైకి చెందిన వ్యాప్‌కో అనే కేంద్ర విభాగ సంస్థ సర్వే నిర్వహిస్తోందని సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి పైభాగంలో జలాశయంలో 200 మీటర్ల వరకు డ్రోన్ సర్వేతో పాటు ఎకో సౌండ్ పద్ధతి, డ్రోన్ ఫొటోగ్రామెట్రీ ఉపయోగించి హైడ్రోగ్రాఫిక్ పద్ధతిలో కూడా సర్వే చేస్తామన్నారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోకి నీటిని పంపింగ్ చేసే పైప్‌లైన్లలో కూడా మట్టి, ఇసుక, రాళ్లు, కంకర పేరుకుపోవడంపై హైడ్రోగ్రాఫిక్ విధానంలో గుర్తించి జెన్కో ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి సమయంలో అడ్డుగా వచ్చే మట్టి, ఇసుక, కంకర, ఇతర వ్యర్థాలను తొలగించడానికి జెన్కో చర్యలు తీసుకుంటుందని సీఈ పేర్కొన్నారు.


నాగార్జునసాగర్ జలాశయం వద్ద సర్వేకు ఉపయోగించిన డ్రోన్

సాగర్, బుద్ధవనం అభివృద్ధికి రూ.100 కోట్లు ఇవ్వండి

● కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్‌కు ఎంపీ రఘువీర్‌రెడ్డి వినతి

న్యూఢిల్లీ, హాలియా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, బుద్ధవనం అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన అధికారిక నివాసంలో కలిసి, వినతిపత్రం అందజేశారు. చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి అందాలతో కూడిన ఈ ప్రదేశాలను ప్రపంచ పర్యాటక కేంద్ర గమ్యస్థానాలుగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎత్తిపోతల జలపాతం, నాగార్జున కొండ, బుద్ధవనం వంటి ప్రధాన ఆకర్షణ ప్రాంతాలు ఉన్నాయని, అక్కడ ఎకో ఫ్రెండ్లీ నివాసాల అభివృద్ధితో పాటు జాతీయ, అంతర్జాతీయస్థాయి వినోద కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని కేంద్ర మంత్రికి ఎంపీ వివరించారు. దీంతో స్థానికంగా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. తెలంగాణ పర్యాటక రంగాభివృద్ధికి కేంద్రం "స్వదేశ దర్శన్ పథకం 2.0"లో భాగంగా చేయూతనివ్వాలని కోరారు.


కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు సాగర్ విద్యార్థుల ఎంపిక

నాగార్జునసాగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సుప్ర విరాజ్, ఎండీ సుభానూర్ అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ లలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 23, 24, 25 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కలువల గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఇద్దరు విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలో లూథియానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులను జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ కిరణ్‌కుమార్, సిస్టర్ క్లారా, సిస్టర్ లలిత అభినందించారు.


నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విజయోత్సవాలు చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ రాద్ధాంతం

● హరీశ్‌రావు, కౌశిక్ రెడ్డిలవి వీధి నాటకాలు ● - ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డిలవి వీధి నాటకాలని, ప్రజల్లో సానుభూతి కోసం ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో పదేళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో చామల కిరణ్‌కుమార్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. మీడియా, ప్రజలను పక్కదారి పట్టించేందుకు హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, వాళ్లకు వాళ్లే పోలీస్‌స్టేషన్లకు వెళ్లి గొడవలు సృష్టించి అరెస్టు చేయించుకుంటున్నారని ఆరోపించారు.

యాసంగికి ప్రణాళికలు


సాగర్ ఎడమ కాల్వలో ప్రవహిస్తున్న నీరు(ఫైల్)

- సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలకు అధికారుల సన్నాహాలు
- డిసెంబరు 10 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 15 వరకు
- వారబందీ పద్ధతిలోనే నీటి విడుదల ఉంటుందన్న ఎన్నెస్పీ అధికారులు

నాగార్జునసాగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వ ఆయకట్టుకు యాసంగి(రబీ) సాగుకు నీటి విడుదలకు ఎన్నెస్పీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎడమ కాల్వ పరిధిలో వానాకాలం(ఖరీఫ్) పంట కోతలు పూర్తయ్యాయి. ఆయకట్టులో యాసంగికి రైతులు నార్లు పోసుకొని వరి సాగుకు సిద్ధమవుతున్నారు. ఎడమ కాల్వ పరిధిలో తెలంగాణలో ఉమ్మడి నల్లగొండ జిల్లా, ఖమ్మం జిల్లాలతో పాటు ఏపీలో నూజీవీడు, నందిగామా ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు ఎంత మేరకు నీరు అవసరమవుతుందో ఇప్పటికే నీటి పారువల శాఖ అధికారులు అంచనాలు సిద్ధం చేసినట్లు సమాచారం. 2014 నుంచి 10 సంవత్సరాల్లో 2015, 2023 సంవత్సరాల్లో తప్ప మిగిలిన అన్ని సంవత్సరాల్లో రబీకి డిసెంబరు నెలలో సాగు నీటి విడుదల చేశారు.

వారబందీ పద్ధతిలో సాగు నీటి విడుదల

గతంలో వారబందీ పద్ధతిలో సాగునీరు విడుదల చేసినప్పుడు డిసెంబరు 10వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు నెల రోజులు నిరంతరాయంగా నీటిని విడుదల చేసి ఆ తర్వాత తొమ్మిది రోజులు నీటిని విడుదల చేసి ఆరు రోజులు నీటి విడుదల నిలిపేవారు. ఈ వారబందీలో నీటి విడుదలతో రైతులకు అధిక దిగుబడి వచ్చినట్లు పలు సర్వేల్లో తేలింది. వారబందీలో నీటిని విడుదల చేయడంతో నీరు కూడా వృథా కాకుండా రైతులు పొదుపుగా వాడుకునే వారు. అందుకే ఈ ఏడాది కూడా వారబందీ పద్ధతిలో సాగు నీటి విడుదలకు ఎన్నెస్పీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు 10వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 15వ తేదీ వరకు ఎడమ కాల్వ ఆయకట్టుకు సాగునీటిని వారబందీ పద్ధతిలో విడుదల చేయడానికి నివేదికలు తయారు చేసిన ఎన్నెస్పీ అధికారులు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు అందజేసినట్లు సమాచారం. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు ఖమ్మం జిల్లాలో 6.50లక్షల ఎకరాల సాగు చేస్తున్నారు. బోర్లు, బావుల కింద మరో 50వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. ఏపీలో నూజీవీడు బ్రాంచ్ కెనాల్, నందిగామా 16,17 కాల్వలకు 8 టీఎంసీల నీరు అవసరం అవుతుందని అధికారులు అంచా వేసి నివేదికలు తయారు చేశారు. నల్లగొండ జిల్లాలో 1,45,000 ఎకరాల సాగుకు 20 టీఎంసీల నీరు, సూర్యాపేట జిల్లాలో 2,30,000 ఎకరాల సాగుకు 21టీఎంసీల నీరు, ఖమ్మం జిల్లాలో 2,54,000 ఎకరాల సాగుకు 32టీఎంసీల నీరు అవసరముందని నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

10 సంవత్సరాలల్లో ఎడమ కాలువ పరిధిలో రబీ సాగు నీటి విడుదల వివరాలు

సంవత్సరం	సాగు నీటి విడుదల తేదీ	నాటి నీటి మట్టం (అడుగుల్లో)
2014	డిసెంబరు11	558.70
2015	క్రాఫ్ హాలిడే	510.00
2016	డిసెంబరు 5	526.40
2017	డిసెంబరు11	558.10
2018	డిసెంబరు27	548.10
2019	డిసెంబరు16	578.80
2020	డిసెంబరు07	588.60
2021	డిసెంబరు16	586.00
2022	డిసెంబరు 6	586.00
2023	క్రాఫ్ హాలిడే	506.00

మూసీలో 4.46టీఎంసీల నీరు

మూసీ ప్రాజెక్టు పరిధిలో స్థిరీకరించిన పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు నిర్మించిన తొలినాళ్లలో 35వేల ఎకరాలుగా నిర్ణయించినప్పటికీ రిజర్వాయర్‌లో పూడిక పేరుకుపోయిన నేపథ్యంలో రెండు దశాబ్దాల క్రితమే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టును 30వేల ఎకరాలుగా స్థిరీకరించారు. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీలో ప్రస్తుతం 644.68 అడుగులు(4.38టీఎంసీలు) నీరు ఉంది. ఆయకట్టులో రైతులు సాగు చేసే పంటల ఆధారంగా నీటిని ఆన్‌అండ్ ఆఫ్ పద్ధతిలో విడుదల చేయనున్నారు. మొదటి విడతగా 25రోజులు, ఆ తర్వాత ఒక్కో విడతకు మధ్య పది రోజుల విరామంతో 15రోజుల చొప్పున మూడు విడతల పాటు నీటిని విడుదల చేయనున్నారు. తొలి విడత 25రోజుల పాటు నీటి సాగే విడుదలకు 1.50టీఎంసీలు, 15రోజుల చొప్పున మూడు విడతలుగా సాగే నీటి విడుదలకు ఒక్కో విడతకు 0.50టీఎంసీల చొప్పున వినియోగించనున్నారు.

మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో..

కేతేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో యాసంగి పంటల సాగుకు నీటిని అందించేందుకు అవసరమైన ప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. ఈ నెల మూడో వారం నుంచి ప్రాజెక్టు పరిధిలోని 30వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించనున్నారు. ఆన్ ఆఫ్ పద్ధతిలో వచ్చే ఏడాది ఏప్రిల్ రెండో వారం వరకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ జలసౌధలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సమీకృత నీటి ప్రణాళిక, యాజమాన్య కమిటీ (ఎస్‌సీఐడబ్ల్యూఏఎం-స్కీమ్) సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో పాల్గొన్న వివిధ సర్కిళ్ల ముఖ్య ఇంజనీర్లు ఆయా ప్రాజెక్టుల్లో నీటి లభ్యత, యాసంగి పంటల లక్ష్యం, వానాకాలం పంటల సాగు వివరాలపై చర్చించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా మూసీ ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వలు, వానాకాలంలో సాగు విస్తీర్ణం, యాసంగిలో ఆయకట్టు నిర్ణయం తదితర అంశాలను సమావేశానికి హాజరైన సూర్యాపేట సర్కిల్ ఎస్ఈతో కూలంకశంగా చర్చించిన అధికారులు ఆయకట్టులోని 30వేల ఎకరాలకు సాగునీటి అందించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆన్ అండ్ ఆఫ్(వారబందీ) పద్ధతిన నీటిని విడుదల చేస్తూ ప్రాజెక్టులోని మూడు టీఎంసీల నీటిని వినియోగించాలని సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంలో ఉండడంతో మొత్తం ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మూసీ ప్రాజెక్టు


సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.50
టీఎంసీలు	302.9125
ఎడమకాల్వకు నీటి విడుదల	4,814
కుడికాల్వకు	8,067
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	35,315
అవుట్‌ఫ్లో	14,315క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.46 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	4197 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.68 అడుగులు
టీఎంసీలు	4.38
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	215.84 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	215.84 క్యూసెక్కులు

నవ దంపతుల కుటుంబాల్లో తీరని విషాదం

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన నవ వధువు మృతి
- ఈ నెల 2వ తేదీన మృతిచెందిన నవ వరుడు


ఉపేందర్, రత్నకుమారి(ఫైల్)

మేళ్లచెర్వు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కోసం ఇంటికి కట్టిన తోరణాలు పూర్తిగా వాడలేదు. కాళ్ల పారాణి ఆరలేదు. పెళ్లి బాజాల సందడి కళ్ల ముందే కదలాడుతూనే ఉంది. రోడ్డు ప్రమాదం ఆ నవ దంపతుల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. నవ వరుడు మూడు రోజుల క్రితం అక్కడికక్కడే మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవ వధువు కూడా మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన గండారపు నారాయణ కుమార్తె రత్నకుమారి(34)కి మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన రాచూరి ఉపేందర్(36)కు గత నెల 29న వివాహమైంది. ఈ నెల 2వ తేదీన వరుడి స్వగ్రామం తడకమళ్ల నుంచి వధువు స్వగ్రామం వెల్లటూరుకు వధూవరులు బైక్‌పై వస్తుండగా, రోడ్డుపక్కన నిలిపిన ట్రాక్టర్‌ను ఢీకొట్టంతో ఉపేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రత్నకుమారి తీవ్రంగా గాయపడగా మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రత్నకుమారి గురువారం ఉదయం మృతిచెందింది. రత్నకుమారికి గతంలో మూడు వివాహాలు జరిగాయి. మొదటి రెండు వివాహాల్లో పెద్ద మనుషుల సమక్షంలో విడిపోయారు. మూడో వివాహం జరిగిన కొన్ని నెలలకు భర్త మృతిచెందాడు. ఉపేందర్‌తో గత నెల 29వ తేదీన వివాహంకాగా, ఈ నెల2వ తేదీన జరిగిన ప్రమాదం ఇద్దరినీ బలితీసుకుంది. రెండు కుటుంబాల సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్


బంగారు ఆభరణాలు చూపుతున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేటక్రైం, డిసెంబరు 5, (ఆంధ్రజ్యోతి): తాళం వేసిఉన్న ఇళ్లను లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని సూర్యాపేట పట్టణ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేట పోలీసులు ఈనెల 5వ తేదీన ఉదయం సమయంలో పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద పెట్రోలింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో జనగామ జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన డ్రైవర్‌గా పనిచేసే శీలంశెట్టి వెంకటరమణ అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో అనుమానంతో అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా అందులో బంగారు ఆభరణాలు కనిపించాయి. వాటి గురించి కూడా సరైన సమాధానం చెప్పకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ తమదైన శైలిలో విచారించగా 2021, 2022లో సూర్యాపేట పట్టణంలో రెండు నివాసాలు, సూర్యాపేట మండల పరిధిలో ఒక ఇంట్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. చోరీల్లో దొంగిలించిన బంగారు ఆభరణాలను ఇప్పటి వరకు తన ఇంట్లోనే భద్రపరిచి నేడు సూర్యాపేటలో విక్రయించి అవసరమైతే మళ్లీ సూర్యాపేటలో చోరీ చేయాలని సూర్యాపేటకు వచ్చినట్లు తెలిపాడు. దీంతో వెంటనే వెంటకరమణపై కేసు నమోదు చేసి అతడి వద్ద నుండి సుమారు రూ.15.20లక్షల విలువ చేసే 19తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వెంకటరమణపై గతంలో హైద్రాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ల పరిధిలో 30దొంగతనాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయని తెలిపారు. చోరీలకు పాల్పడిన వెంకటరమణను కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. నేరస్తుడిని చాకచక్యంగా పట్టుకున్న పట్టణ పోలీసులను అదనపు ఎస్పీ అభినందించారు. సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ జి. రవి, ఇన్‌స్పెక్టర్లు పి. వీరరాఘవులు, గురుకుల రాజశేఖర్, ఎస్‌బీఐ నాగభూషణరావు, ఎస్ఐలు ఏడుకొండల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వలపు వల కి'లేడీ' కోసం వెతుకులాట

- వాజేడు ఎస్ఐ ఆత్మహత్య ఘటనలో విచారణ ● యువతి స్వగ్రామం దూద్యాతండాలో కలకలం ● ఈ నెల 3న కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసులు

చిలుకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు ఎస్ఐ హరీష్ ఆత్మహత్య ఘటనలో వలపు వల విసిరిన యువతి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎస్ఐ హరీష్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో రిసార్ట్‌లో అతనితో పాటు ఉన్న యువతిని వాజేడు పోలీసులు ఎస్కార్ట్‌తో వచ్చి ఆమె స్వగ్రామం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దూద్యాతండాకు వచ్చి పోలీసుల సమక్షంలో తల్లి, గ్రామపెద్దలకు ఈ నెల 3వ తేదీ ఉదయం అప్పగించి వెళ్లారు. అయితే నిత్యం పలు కేసులతో వివాదాల్లో ఉన్న యువతికి, తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని కుటుంబ సభ్యులు అనడంతో ఆ యువతి దూద్యాతండాలోని ఇంటికి వెళ్లకుండా చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. శబరిమలై యాత్రకు వెళ్లిన ఆ యువతి తండ్రి, అన్న, తమ్ముడు బుధవారం గ్రామానికి చేరుకున్నారు. ఎవరు అడిగినా ఆ యువతికి, తమ కుటుంబానికి సంబంధం లేదని, ఎక్కడికి వెళ్లిందో తెలియదని చెబుతున్నట్లు సమాచారం. ఆత్మహత్య చేసుకున్న సమయంలో పక్కనే ఉన్న యువతిని పోలీసులు ఎస్కార్ట్‌తో తీసుకువచ్చి అప్పగించారని, ఆమె పరారయ్యాక వివరాలు సేకరించడమేమిటని స్థానికులు పేర్కొంటున్నారు.

యువతి వలపు వల బాధితుల్లో పలువురు యువకులు

ఇదే యువతి గతంలో కూడా పలువురు యువకులకు వలపు వల విసిరి వారితో సన్నిహితంగా మెలిగినట్లు తెలిసింది. తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే అడిగినంత డబ్బులు ఇవ్వాలని, లేకపోతే తనతో దిగిన ఫొటోలు బయటపెడతానని, కేసులు పెడతానని డిమాండ్ చేసినట్లు సమాచారం. గతంలో ప్రేమ, పెళ్లి పేరుతో యువకులను లొంగదీసుకునేందుకు హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, హయత్‌నగర్, కోదాడ, చిలుకూరు పోలీస్‌స్టేషన్లలో ముగ్గురు యువకులు తనను వేధించారని, పెళ్లి చేసుకుంటానని మోసం చేశారని వేర్వేరు సమయాల్లో కేసులు పెట్టింది.

అదే సమయంలో ఆ యువతిపై కూడా పలుచోట్ల పోలీసులకు పలువురు ఫిర్యాదు చేసినట్ల సమాచారం. యువతి కోర్టు కేసుల విషయమై మానసిక రోగిలా ప్రవర్తించడంతో ఎర్రగడ్డ వైద్యశాలలో 2018లో ఆమె మానసిక చికిత్స పొందినట్లు సమాచారం. యువతి కుటుంబ సభ్యులకు చెప్పకుండా సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకుని ఉండడంతో ఆచూకీ లభించలేదని తెలిసింది.

పసి ప్రాణం తీసిన 'పంచాయితీ'

- భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు ● భర్తపై కోపంతో కుమారుడిని బావిలోకి తోసి దూకిన తల్లి ● బాలుడు మృతి.. తల్లిని రక్షించిన స్థానికులు

 
ఆయాన్(ఫైల్), తల్లి మమత

హుజూర్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య పంచాయితీ అభం శుభం తెలియని చిన్నారి ప్రాణం తీసింది. సంవత్సరం నుంచి భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. వారి కోపతాపాలకు చిన్నారి బలయ్యాడు. పది నెలల బాలుడిని బావిలోకి తోసి తానూ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘట నలో చిన్నారి ప్రాణాలు కోల్పోగా.. తల్లిని స్థానికులు రక్షించారు. బుధవారం రాత్రి సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లక్కవరం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం... గరిడేపల్లి మండలం పొనుగోడుకు చెందిన మమతకు హుజూర్‌నగర్ మండలం లక్కవరం గ్రామానికి చెందిన రణపంగు నవీన్‌తో 2018లో వివాహంకాగా, వీరికి కుమార్తె శాన్వి(6), కుమారుడు ఆయాన్ (10 నెలలు) ఉన్నాడు. నవీన్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. మమత గృహిణి. ఏడాదిగా భార్యాభర్తల మధ్య ఘర్షణ జరుగుత న్నాయి. బుధవారం మధ్యాహ్నం కూడా భార్యభర్త గొడవ పడ్డారు. మధ్యాహ్నం నవీన్ ఆస్పత్రికి వెళ్లాడు. రాత్రి 9 గంటల సమయంలో మమత కుమార్తె శాన్విని ఇంట్లోనే ఉంచి, ఆయాన్‌ను తీసుకుని ఇంటి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో వేసింది. మమత కూడా బావిలోకి దూకింది. అదే సమయంలో నవీన్ ఇంటికి వచ్చాడు. మమత, ఆయాన్ కన్పించకపోవడంతో స్నేహితలతో కలిసి మొదట ఓ బావివద్దకు వెళ్లి చూడగా వారు కన్పించలేదు. మరో బావి వద్దకు వెళ్లి చూడగా మమత బావిలోపల ఉన్న ఫుట్‌బాల్ పైపును పట్టుకుని కన్పించింది. దీంతో నవీన్, అతని స్నేహితులు కలిసి మమతను బయటకు తీశారు. తర్వాత మమతను బాబు గురించి ఆరా తీయగా బావిలో వేసినట్లు చెప్పింది. రాత్రి కావడంతో బాబు కోసం ఎంత వెతికినా దొర కలేదు. గురువారం ఉదయం గజ ఈతగాళ్లను పిలిపించి బావిలో ఉన్న ఆయాన్ మృతదేహాన్ని బయటకు తీశారు. గురువారం ఉదయం బాలుడి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మమత భర్త నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆయాన్ మృతిపై అనుమానాలు

ఆయాన్ మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భార్యభర్తలు కొంత కాలం వేర్వేరుగా ఉండగా వారిద్దరి మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామస్థులు అనేకమార్లు ఇద్దరి సయోధ్య కుదిర్చారు. అయినా ఘర్షణలు ఆగలేదు. నవీన్, మమతల కుమారుడు ఆయాన్‌తో బావిలో దూకిన మమత బాలుడిని ముందే చంపి బావిలో పడేసిందా? లేక ముందు బాలుడిని బావిలోకి విసిరేసిందా? అదీకాక ఆయాన్‌ను బావిలో వేసి ఏమీ తెలియనట్లు మమత బావిలోకి దిగి ఉందా అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మమత, నవీన్ అనేకసార్లు ఘర్షణ పడడం, ఆమె తల్లిగారింటికి పోవడం, కుటుంబ సభ్యులు మళ్లీ భార్యభర్తలిద్దరిని కలిపిన నేపథ్యంలో కొంతకాలం నుంచి తన కుమారుడిని చంపి తాను చస్తానన్న ఆమె వ్యాఖ్యల్లో నిజమెంత, అసలు ఏం జరిగింది. అన్న సంఘటనపై గ్రామంలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. నవీన్ ఇంటి పక్కనే ఉన్న వ్యవసాయ బావులు రెండు ఉండగా మొదట ఒక బావిలో చూసినప్పుడు ఆమె కనిపించలేదని, మరో బావి చూసి వచ్చిన తర్వాత మొదట చూసిన బావిలో ఫుట్‌బాల్ పైపు పట్టుకుని ఉన్నట్లు గుర్తించిన గ్రామస్తులు, బాలుడిని హత్యచేసి బావిలో వేసిందా? లేక హత్యనా? ఆమెది హత్యాయత్నమా అన్నదానిపై చర్చించుకుంటున్నారు.

వివాహిత బలవన్మరణం


మౌనిక(ఫైల్)

భువనగిరి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్లలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన సుబ్బూరి చంద్రమౌళి , బుచ్చమ్మ దంపతుల కుమార్తె మౌనిక(29)కు ఇదే మండలం ముస్యాలపల్లి గ్రామానికి చెందిన మల్లెల మహేందర్‌తో ఏడు సంవత్సరాల క్రితం వివాహమైంది. మౌనిక, మహేందర్ దంపతులు ప్రస్తుతం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో నివాసముంటున్నారు. కుమార్తె ఆధ్య(6), కుమారుడు శెర్యన్(4) ఉన్నారు. బుధవారం రాత్రి మహేందర్ తన భార్య మౌనికను పుట్టినిల్లు మండలంలోని చందుపట్లలో తన తల్లిదండ్రుల వద్ద వదిలి వెళ్లాడు. గురువారం ఉదయం మౌనిక తండ్రి సుబ్బూరు చంద్రమౌళి మేకలు, గొర్రెలు కాసేందుకు, తల్లి బుచ్చమ్మ వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ సమయంలో మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఇంట్లోని గదిలోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుమార్తె ఆధ్య బయటకు వచ్చి ఏడుస్తుండడంతో చుట్టు పక్కల వారు గమనించి భువనగిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రి మార్చురికి తరలించారు. మౌనిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, మృతికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపారు.

వైన్స్ దుకాణంలో చోరీ

చింతపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని ఓ వైన్‌షాపులో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని దుర్గా వైన్స్‌లో ఎప్పటిమాదిరిగానే రాత్రి 10 గంటలకు వరకు మద్యం విక్రయాలు జరిపి దుకాణానికి తాళం వేసి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు వైన్స్ పైభాగం కప్పు ధ్వంసం చేసి దుకాణంలోని రూ.75 వేలు విలువ చేసే మద్యం సీసాలను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం క్యాషియర్ చూడగానే చిందరవందరగా ఉండటం వల్ల చోరీ జరిగిందని గమనించి పోలీసులకు సమా చారం ఇచ్చారు. ఎస్ఐ యాదయ్య సిబ్బందితో అక్కడి వచ్చి విచారణ చేస్తున్నారు. క్యాషియర్ గడిగ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

150 కేసుల్లో జరిమానాలు

హుజూర్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలో జరిగిన 150 కేసులో పలువురు నిందితులకు జరిమానాలు విధిస్తూ హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ తీర్పు చెప్పారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు, పేకాట, పలు ఘర్షణలకు సంబంధించిన వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్న వారు గురువారం జూనియర్ సివిల్ జడ్జి ఎదుట తమ నేరాలను అంగీకరించి క్షమించమని కోరడంతో 150 కేసుల్లో నిందితులకు 2లక్షల 11వేల జరిమానా విధిస్తూ ఆదేశించారు. ఆ డబ్బులు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని ఆదేశించారు. క్షణకావేశంలో చేసే నేరాలను సరిదిద్దుకొని మంచి జీవితం గడపాలన్నారు. లోక్‌అదాలత్‌లో కూడా అనేక కేసులను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాలరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్రాంపల్లిలో బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచి పోలీసులు రేషన్ బియ్యం పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లుగా సమాచారం అందడంతో మండలంలోని గుండ్రాంపల్లిలో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచి పోలీసులు నిఘా పెట్టగా డీసీఎం వాహనం స్థానికంగా ఉన్న రైస్ మిల్లులోకి వెళ్లింది. మిల్లులో ఆగిన డీసీఎం నుంచి బస్తాలను దిగుమతి చేసే సమయంలో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచి పోలీసులు పట్టుకున్నారు. డిసిఎంలో దిగిమతి చేసే బస్తాలను పరిశీలించగా రేషన్ బియ్యంగా గుర్తించారు. అందులో ఉన్న బస్తాల్లో బియ్యం సుమారు 100 క్వింటాళ్లు ఉన్నాయి. బియ్యం పట్టుబడిన సమాచారాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అందజేశారు. ఆ శాఖ డిప్యూటీ తహసీల్దార్ దీపక్ గురువారం మిల్లుకు చేరుకుని పంచనామా నిర్వహించి 6ఏ కేసు చేసి పోలీసులకు అప్పగించారు. డీసీఎం వాహనం ఖమ్మం జిల్లా నుంచి వచ్చినట్లు సమాచారం.

ట్రాక్టర్ల బ్యాటరీలు అపహరణ

త్రిపురారం నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలో ట్రాక్టర్ల బ్యాటరీలు బుధవారం రాత్రి చోరీకి గురయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం గ్రామానికి చెందిన మదర్ ఉస్సేన్ రాజీవ్‌కాలనీ సమీపంలోని పొలం దమ్ము చేసి ట్రాక్టర్ అక్కడే ఉంచాడు. ఉదయం ట్రాక్టర్ వద్దకు వెళ్లి ట్రాక్టర్‌ను స్టార్ట్ చేయడానికి ప్రయత్నించగా, స్టార్ట్ కాలేదు. అనుమానంతో పరిశీలించగా బ్యాటరీ చోరీకి గురైనట్లు గుర్తించాడు.

సత్యనారాయణపురం గ్రామంలో రఘురామ రైస్‌మిల్లు వెనుక భాగం పొలాల్లో రెండు ట్రాక్టర్లు ఉండగా ఆ బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని. యజమాని కుంచెం శ్రీను తెలిపాడు. బాధితులు ఎస్ఐ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల నీలాయిగూడెం, సమీపంలోని నారమ్మగూడెం పొలాల్లో ఉంచిన ట్రాక్టర్ల బ్యాటరీలు దొంగలు ఎత్తుకెళ్లారు. ఇప్పటి వరకు సుమారు వరకు 40 ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీకి గురయ్యాయి.

స్లాట్ బుక్ చేశాక ఎందుకు రిజిస్ట్రేషన్ చేయరు?

- తహసీల్దార్‌ను నిలదీసిన వృద్ధ దంపతులు ● పట్టించుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటామని నిరసన ● రిజిస్ట్రేషన్ చేయడంతో సద్దుమణిగిన ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న వృద్ధ దంపతులు

సంస్థాన్‌నారాయణపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నా ఎందుకు రిజిస్ట్రేషన్ చేయడం లేదని వృద్ధ దంపతులు తహసీల్దార్‌ను నిలదీశారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో సంఘటన జరిగింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయకుంటే తాము ఆత్మహత్యాయత్నం చేసుకుంటామని హెచ్చరించారు. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన జక్కిడి బాల్‌రెడ్డి తన పేరిట ఉన్న సుమారు 40ఎకరాల భూమిలో 36 ఎకరాలు తన కుమారుడైన జక్కిడి శ్రీనివాస్‌రెడ్డికి గతంలో రిజిస్ట్రేషన్ చేశారు. కుమారుడు ప్రస్తుతం తమను పట్టించుకోకపోవడం, తనకున్న ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం తన పేరిట ఉన్న నాలుగు ఎకరాల 10 గుంటల భూమిని విక్రయానికి పెట్టారు. ఇందులో భాగంగా కొనుగోలుదారుడికి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు బుధవారం స్లాట్ బుక్ చేసుకున్నారు. గురువారం 12గంటలకు స్లాట్ సమయం ఇవ్వగా తాము రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే రిజిస్ట్రేషన్ చేయకూడదంటూ కుమారుడు జక్కిడి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశాడని, అందుకే రిజిస్ట్రేషన్ నిలిపివేశామని అధికారులు తెలిపారని బాధితుడు పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ ఎందుకు చేయరని దంపతులు అధికారులను నిలదీశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయకుంటే తాము ఇక్కడే ఆత్మహత్యాయత్నం చేసుకుంటామని హెచ్చరించారు. అయినా తహసీల్దార్ స్పందించకపోవడంతో దంపతులు కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో సమస్య జటిలమవుతుందని భావించిన తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయడంతో సమస్య సద్దుమణిగింది. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ తహసీల్దార్ తన కుమారుడితో కుమ్మక్కై రిజిస్ట్రేషన్ చేయనివ్వకుండా ఇబ్బందులకు గురి చేశాడని, ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ ఘటనపై తహసీల్దార్ కృష్ణను వివరణ కోరగా, రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని బాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని, అయినప్పటికీ వారు మాట్లాడుకోవడానికి సమయం ఇచ్చానని తెలిపారు. ఇంతలోనే వారు ఆందోళన చేశారని, నిబంధనల ప్రకారం తాను రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు.

ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్

మర్రిగూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్‌గా సిరి పంగ శ్రీనివాస్‌ను నియమించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా రాజుపేట తండాకు చెందిన కొడాల అల్వాల్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా శ్రవణ్‌కుమార్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు.


చట్టాలపై అవగాహన

కనగల్, డిసెంబరు 5:(ఆంధ్రజ్యోతి) ప్రతి విద్యార్థి బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి రెబికరాణి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కనగల్ మోడల్ స్కూల్‌లో గురువారం బాలల చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలపై లైగింక వేధింపుల నిరోధక చట్టంతో పాటు ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల బాలికలకు ఏమైనా ఇబ్బందులు కలిగితే 1098 హెల్ప్‌లైన్ నెంబర్‌కు కాల్ చేసి సాయం పొందాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఎవరైనా బాల్య వివాహం చేస్తే సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సి పాల్ థామస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్లు రాజ్యం, శ్రీదేవి పాల్గొన్నారు.

రూ.109 కోట్లతో అభివృద్ధి పనులు

▸▸ నల్లగొండ పట్టణంలో రోడ్లు, మురుగు, వరద కాల్వలకు టెండర్లు ▸▸ జనవరిలో పనులు ప్రారంభమయ్యే అవకాశం

నల్లగొండ పట్టణం మరింత అభివృద్ధి కానుంది. ప్రధానంగా నల్లగొండ పట్టణంలో మంచి నీరు, రోడ్లు, మురుగు కాల్వలు, వరద కాల్వలు వంటి అభివృద్ధి పనులపై దృష్టి సారించింది. పట్టణ ప్రజల అవసరాల మేర పాలకవర్గం ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ప్రభుత్వం నుంచి సానుకుల స్పందన రావడంతో అధికారులు అందకు తగ్గట్లుగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నల్లగొండ పట్టణంలో మంచినీరు ఇప్పటి వరకు రోజు విడిచి రోజు విడుదల చేస్తున్నారు. ఇకపై ప్రతీరోజు మంచి నీరు సరఫరా చేయలన్న ఉద్దేశ్యంతో రూ.96 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు.
- (ఆంధ్రజ్యోతి,రామగిరి)


నల్లగొండ పట్టణం

నల్లగొండ పట్టణంలో రూ.109 కోట్ల వివిధ రకాల అభివృద్ధి పనులకు ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో రూ.55కోట్లతో 94 కిలోమీటర్లు సీసీ రోడ్లు, రూ.11 కోట్లతో 9 కిలోమీటర్ల బీటీ రోడ్లు, రూ.19కోట్లతో 9.5 కిలోమీటర్లు వరద కాల్వలు, రూ.2కోట్లతో గొల్లగూడ ప్రాంతంలో శ్మశానవాటికతో పాటు మరికొన్ని పనులు ఉన్నాయి. ప్రారంభమైన ఈ టెండర్ ప్రక్రియ డిసెంబరు 15వ తేదీన హైదరాబాద్ లోని మునిసిపల్ ప్రధాన కార్యాలయంలో టెండర్ ఓపెన్ చేయనున్నారు. జనవరిలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

రూ.96 కోట్లతో మంచినీటి శుద్ధి కేంద్రం

పట్టణ ప్రజలకు ప్రతీ రోజు మంచినీరు అందించాలన్న ఉద్దేశ్యంతో రూ.96కోట్లతో పట్టణంలోని పానగల్ ప్రాంతంలో 70 ఎంఎల్‌డీ కెపాసిటీ గల మంచినీటి శుద్ధి కేంద్ర ఏర్పాటుకు పాలకవర్గం నిర్ణయించింది. ఈ మంచినీటి శుద్ధి కేంద్రం 2053 వరకు మంచినీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా డిజైన్ తయారు చేశారు. ఈ కేంద్రం ప్రారంభమైతే పట్టణంలో ప్రతీరోజు మంచినీరు సరఫరా కానుంది. ఈ రూ.96 కోట్లతో 12 కిలోమీటర్ల పైపులైన్లతో పాటు మంచినీటి శుద్ధి కేంద్రానికి ఖర్చు చేయనున్నారు.

ఇదిలా ఉండగా 2 లక్షల పై చిలుకు జనాభా ఉన్న నల్లగొండ పట్టణంలో ఇప్పటివరకు రోజు విడిచి రోజు 44 ఎంఎల్‌డీ మాత్రమే మంచినీరు సరఫరా అవుతుంది. అయితే నూతనంగా నిర్మించబోయే శుద్ధి కేంద్రం పూర్తయితే 114 ఎంఎల్‌డీ మంచినీరు ప్రతీ రోజు సరఫరా కానుంది. (యూటీడీఎఫ్) అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఫండ్ కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు చేసేందుకు ఇక్కడి అధికారులు, పాలకవర్గం హైదరాబాద్ మునిసిపల్ శాఖ ప్రధాన కార్యలయానికి ప్రతిపాదనలు నివేదించారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన మునిసిపల్ శాఖ కేంద్ర ప్రభుత్వానికి నివేదించనుంది. తద్వారా కేంద్రప్రభుత్వం అనుమతి రానుంది. టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమయ్యేందుకు మరో 3 నుంచి 4 నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉండవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ఇప్పటికే రూ.56 కోట్లతో నడుస్తున్న పనులు

ఇదిలా ఉండగా అమృత్ పథకం ద్వారా నల్లగొండ పట్టణంలో రూ.56 కోట్లతో మంచి నీటి పనుల నడుస్తున్నాయి. వీటిలో రాంనగర్, అక్కచెల్మ, బత్తాయి మార్కెట్, వినాయక హౌసింగ్ బోర్డు కాలనీ, అన్నేశ్వరంగుట్ట, వల్లభరావు చెరువు, దత్తసాయి కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో, మధురానగర్, పాతబస్తీ శివాలయం సమీపంలో, రాఘవేంద్రనగర్ వంటి ప్రాంతాల్లో 11 ట్యాంకులతో పాటు 40 కిలోమీటర్ల మేర పైపులైన్ల పనులు నడుస్తున్నాయి. వీటిలో కొన్ని ప్రారంభ దశలో ఉండగా మరి కొన్ని పనులు సగంపైగా అవుతున్నాయి.

నీలగిరిని అభివృద్ధి చేయడమే లక్ష్యం



నల్లగొండ పట్టణాన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం. ఇందులో భాగంగా రూ.109 కోట్లతో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, వరద, మురుగుకాల్వలు వంటి అభివృద్ధి పనులకు టెండర్ పిలిచాం. ఈ పనులు డిసెంబరు చివరి వారంలో లేదా జనవరిలో ప్రారంభం కానున్నాయి. అదేవిధంగా ప్రతీ రోజు మంచినీరు అందించాలన్న లక్ష్యంతో మంత్రి కోమటిరెడ్డి సహకారంతో మరో రూ.96 కోట్లతో మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు మునిసిపల్ శాఖకు ప్రతిపాదనలు పంపించాం. పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం.
- మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుల ఎన్నిక

కట్టంగూరు, కేతేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీ సభ్యులుగా పెంజర్ల సైదులు, బొజ్జ చినవెంకులు ఎన్నికయ్యారు. మిర్యాలగూడలో మూడు రోజుల పాటు జరిగిన సీపీఎం జిల్లా 21వ మహాసభలో సైదులును ఎన్నుకున్నారు.

● కట్టంగూరు మండలంలోని ఇస్మాయిల్ పల్లి గ్రామానికి చెందిన పెంజర్ల సైదులు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా మూడోసారి ఎన్నికయ్యారు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామానికి చెందిన బొజ్జ చినవెంకులు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా మూడవ సారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సీపీఎంను బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

హరీష్‌రావు అరెస్టు అప్రజాస్వామికం

మర్రిగూడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కలిసేందుకు వెళ్తున్న మాజీ మంత్రి హరీష్‌రావును పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మర్రిగూడ మండల రైతు సమన్వయ మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పోకడ పోతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని అన్నారు. ఆయన వెంట వెంకటరమణారెడ్డి, బాలె నర్సింహ, యాదయ్య, రాములు, పగడాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకోసం ప్రత్యేక పథకాలు


సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలను మహారాణులుగా చేయడం కోసం ప్రత్యేక పథకాలను తీసుకువచ్చి అమలు చేస్తోందని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా గురువారం ఆర్‌టీసీ బస్టాండ్‌లో రీజనల్ మేనేజర్ కే.జానిరెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 114.34 మంది మహిళలు ఆర్టీసీని ఉపయోగించుకుంటున్నారని అన్నారు. అనంతరం సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో అన్నదానం గొప్ప


అన్నదానం చేస్తున్న పెరిక కరణ్‌జయరాజ్

నల్లగొండ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నిదానాల్లోకెల్లా అన్నదానం ఎంతో గొప్పదని పెరిక గోపాల్, రాజారత్నం చారిటబుల్ ట్రస్ట్ జాతీయ చైర్మన్ పెరిక కరణ్‌జయరాజ్ అన్నారు. గురువారం ఆయన తన తనయుడు పెరిక గోపాల్ (యువాన్) జన్మదినం సందర్భంగా పెరిక హన్సికల సహకారంతో స్థానిక మదర్ థెరిస్సా హోంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. పెరిక రాజు, వడ్డబోయిన సైదులు, సింగం శ్రీకాంత్ యాదవ్, వీరస్వామి, కొండేటి మహేష్, పెరుమాళ్ల వేణు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

కేతేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ కేతేపల్లి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మున్నా అశోక్‌యాదవ్ గురువారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిశారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించినందుకు ఆయన ఎమ్మెల్యే వీరేశంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన అశోక్‌యాదవ్‌ను శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మాచర్ల కిరణ్, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శిగా ఎన్నికైన బొడ్డుపల్లి ఉపేందర్‌లు ఉన్నారు.

కాంగ్రెస్ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా విజయ్


విజయ్

నల్లగొండ, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ అసెంబ్లీ యుజన విభాగం ఉపాధ్యక్షుడిగా నల్లగొండలోని కతాల్‌గూడ ప్రాంతానికి చెందిన దాసరి విజయ్ నియామకమయ్యారు. గురువారం ఆన్‌లైన్ జరిగిన కాంగ్రెస్ యువజన విభాగం ఎన్నికల్లో దాసరి విజయ్‌ను అధిక సంఖ్యలో ఓట్లు నమోదు కావడంతో ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు. దాసరి విజయ్ నియామకంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.


గణేష్

శాలిగౌరారం: శాలిగౌరారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొల్లికొండ గణేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాక్షులుగా నూక చంద్రకాంత్, లోడంగి మహేష్, పాకాల సతీష్, షేక్ అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి తరాల శ్రవణ్, కార్యదర్శులుగా కట్లకుంట రమేష్, ఐతగోని శ్రవణ్ ఎన్నికయ్యారు.

నార్కట్‌పల్లి : యువజన కాంగ్రెస్ నకిరేకల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బీ.వెల్లెంలకు చెందిన లక్ష్మణ్ ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, భూపాల్‌రెడ్డికి లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

మీడియా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలవాలి

● శాసనమండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మీడియా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి సహకారంతో జర్నలిస్టులకు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఈ హెల్త్‌క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రేటింగ్ కోసం అవాస్తవాలు ప్రచారం చేయడం కొన్ని మీడియా సంస్థలకు అలవాటుగా మారిందని అన్నారు. దీని వల్ల మొత్తం మీడియా ఇమేజ్‌కు భంగం వాటిల్లుతుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డితో పాటు ప్రెస్‌క్లబ్ బాధ్యులు, ఆస్పత్రి డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో పరుగెత్తుతున్న అభివృద్ధి

● ఎమ్మెల్యే వేముల వీరేశం


నకిరేకల్ వ్యవసాయ మార్కెట్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో అభివృద్ధి పరుగెత్తుతుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం నకిరేకల్ పట్టణంలోని అమృత్ పథకంలో భాగంగా నకిరేకల్ మార్కెట్‌యార్డు, నిమ్మకాయల మార్కెట్ నందు రూ.25 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులకు వీరేశం శంకుస్థాపన చేసి మాట్లాడారు. రక్షిత మం చినీటి పథకం కింద 42 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా నీళ్లు అందించనున్నట్లు తెలిపారు. నకిరేకల్ పట్టణంలో చివరి ఇళ్ల వరకు మంచినీళ్లు అందిస్తామని తెలిపారు. ప్రజాపాలన వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. గత పాలనలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదని, రానున్న నాలుగేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ చెవుగోని రజిత శ్రీనివాస్, అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వీఎన్ స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేస్తాం



వీఎన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుధాకర్‌రెడ్డి, వీరారెడ్డి

నల్లగొండరూరల్, నార్కట్‌పల్లి, గట్టుప్పల్, చిట్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మల్లు వెంకట నర్సింహారెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మల్లు వెంకట్ నర్సింహారెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంజి మురళీధర్, ఎండీ సలీం, పుచ్చకాయల నర్సింహారెడ్డి, అనురాధ, సత్తయ్య, నారాయణరెడ్డి, భీమం, సైదులు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో వీఎన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, నాయకులు చెర్కు పెద్దులు, కల్లూరి యాదగిరి, కొప్పు శ్రవణ్, కుమ్మరి శంకర్, దండు రవి, సైదులు పాల్గొన్నారు.

● గట్టుప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కర్నాటి సుధాకర్ బోట శివకుమార్, కర్నాటి వెంకటేశం, చిక్కుల సైదులు, పబ్బు మారయ్య, విశ్వనాథచారి, పసుపుల చెన్నయ్య, యాదయ్య, పాల్గొన్నారు.

● చిట్యాలలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య మాట్లాడుతూ మల్లు వెంకట నర్సింహారెడ్డి జీవితం నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమలో నాయకులు మల్లం మహేష్, బొబ్బల సుధాకర్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పచ్చి రొట్ట ఎరువులతో భూసారం


రైతులతో మాట్లాడుతున్న ఏవో పురుషోత్తం

కేతేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంట భూముల్లో పచ్చి రొట్ట ఎరువుల సాగుతో భూముల్లో భూసారం పెంపొందించుకోవాలని కేతేపల్లి మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం సూచించారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం కేతేపల్లిలోని రైతువేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేలల పట్ల శ్రద్ధ చూపడం, సరైన యాజమాన్య పద్ధతులతో భూసారాన్ని పరిరక్షించాలన్నారు. విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల నేల ఆరోగ్యం, పోషకాల స్థాయి, భూసారం రోజురోజుకూ క్షీణించి పోతుందన్నారు. రైతులు సేంద్రియ పద్ధతులు అవలంబించి ఆరోగ్యకరమైన పంటలు పండించాలని కోరారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల సమతుల్యత దెబ్బతింటుందన్నారు. సమావేశంలో ఏఈవోలు బాలరాజు, ఉమేష్, నాగరాజు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ

నార్కట్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో గోవుతో కూడిన గోపాలుని దర్శన మూర్తిని గురువారం ప్రతిష్ఠించారు. నార్కట్‌పల్లి మాజీ ఎంపీటీసీ దుబ్బాక శ్రీధర్ పావని దంపతులు దాతలుగా ఈ విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల నుంచి తెప్పించారు. గురువారం మంచి రోజు కావడంతో ఆలయ అర్చకుడు కారంపూడి వెంకటాచార్యులచే ప్రత్యేక పూజలనంతరం దర్శన మూర్తిని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దోసపాటి ప్రసాద్, ఐతరాజు రమేష్, దోసపాటి విష్ణుమూర్తి, కొప్పు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, హర్షిత్‌రెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ మండలం కొత్తపల్లి గ్రామం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించి అనంతారం, గుండ్లపల్లి, దోనకల్, చెన్నుగూడెం, పాతూరు, నర్సింగ్ బట్ల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అబద్ధపు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి ఊరుకో పోస్టురు వేశారని, నేడు ఊర్లోకి రాకుండా మొహం చాటేసి తిరుగుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ బండారు ప్రసాద్, బీజేపీ నాయకులు పోతపాక సాంబయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బోగరి అనిల్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు చామకూరి మహేష్, కొత్తపల్లి ప్రమోద్ పాల్గొన్నారు.

కనగల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలుచేయటంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పులకరం భిక్షం, దాసరి వెంకన్న ఆరోపించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు గురువారం బైక్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పంతంగి సైదులుగౌడ్, మాదగోని ఏడుకొండలు, శేఖర్, జక్కుల నవీన్ నరేందర్, బల్లేష్, హరిబాబు, స్వామి, నాగరాజు, శంకర్, గణేష్ పాల్గొన్నారు.

సమస్యల నిలయాలుగా గురుకులాలు


గురుకుల పరిసరాలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

కేతేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో వెలుగొందిన గురుకులాలు నేడు సమస్యలతో సతమతమవుతున్నాయని బీఆర్ఎస్వీ గురుకులబాట ఇన్‌చార్జి కడారి స్వామియాదవ్ విమర్శించారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, కట్టా శ్రీనివాస్‌లతో కలిసి ఆయన గురువారం కేతేపల్లి మండలంలోని మూసీ బీసీ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న ఆహారం, వసతులు, సౌకర్యాలు తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందడం లేదన్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో పాములు, తేళ్లతో విద్యార్థులు సహవాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలో తాగునీటి సదుపాయం కూడా సక్రమంగా లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు గాదె శివ, ఎన్.శంకర్‌యాదవ్, సాయికల్యాణ్, జి.వెంకన్న, ప్రసాద్, శివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయసముద్రం ఏ అర్హతతో ప్రారంభిస్తారు?


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

చిట్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ అర్హతతో బ్రాహ్మణవెల్లం ల ఉదయసముద్రం ప్రాజెక్టును ప్రారంభిస్తారని? ఆయన ఒక్క రూపాయి అయినా ప్రాజెక్టు కోసం ఖర్చు చేశారా? అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రశ్నించారు. గురువారం చిట్యాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయసముద్రం ప్రాజెక్టుకు మరో 500కోట్లు వెచ్చిస్తేనే పూర్తవుతుందని, పనులన్నీ పూర్తి అయ్యాకే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సీఎం ప్రారంభించబోయే మెడికల్ కళశాల, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టు పనులు కూడా కేసీఆర్ పూర్తి చేసినవేనని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఉదయసముద్రం పనులకు నిధులు కేటాయించాలనీ సీఎంను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ కూరెల్ల లింగస్వామి, పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, కోనేటి ఎల్లయ్య, జిట్ట బొందయ్య, కందాటి రమేష్‌రెడ్డి, సుంకరి యాదగిరి, అంతటి వెంకటేష్ పాల్గొన్నారు.

బిక్షం ఆశయ సాధన కోసం కృషి చేయాలి

శాలిగౌరారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ నాయకుడు పలస బిక్షం ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.డేవిడ్ కుమార్ అన్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో పలస బిక్షం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలస బిక్షం దున్నే వానికే భూమి అనే నినాదంతో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను నిర్మించారని అన్నారు. వందలాది ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టాడని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం, రజకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలకు ఆయుధాలు అందించి తిరుగుబాటు చేయించారని గుర్తు చేశారు. గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, నకిరేకల్ సమితి ప్రెసిడెంట్‌గా ఎన్నో అభివృద్ధి పనులు చేశాడని అన్నారు. దేవరకొండ అల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు ఇందూరు సాగర్, ఏఐకెఎంఎస్ జిల్లా అ ధ్యక్ష, కార్యదర్శులు జ్వాల వెంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఉదయ్ గిరి, పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉపాధ్యక్షుడు ఉదయ్ గిరి, నాయకులు వెంకటేశ్వర్లు, చారి పాల్గొన్నారు.

శ్రీకనక మహాలక్ష్మీదేవిగా రేణుక ఎల్లమ్మ



కనగల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద ఉన్న శ్రీరేణుకాఎల్లమ్మ అమ్మవారు మార్గశిర మొదటి గురువారం రోజున భక్తులకు శ్రీకనక మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయం అమ్మవారికి శ్రీలలిత స హస్రనామార్చనలతో విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు చీరసారె ఒడి బియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

దాసోజు జ్ఞానేశ్వర్‌కు డాక్టరేట్


జ్ఞానేశ్వర్

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండకు చెందిన ప్రముఖ విమర్శకుడు దాసోజు జ్ఞానేశ్వర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు సాహిత్య విభాగంలో గురువారం డాక్టరేట్ ప్రకటించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ రఘు పర్యవేక్షణలో ఆచార్య కోవెల సుప్రసన్న కవిత్వం- పరిశీలన అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు. జ్ఞానేశ్వర్‌ను కూరెళ్ల విఠలాచార్య సత్కరించారు. సాహితీ వేత్తలు క్రిష్ణకౌండిన్య, పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, ఆపస్ జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరాములు, హెచ్ఎం రాధాకిషన్ అభినందించారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.127	208	238
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 19.4



నియోజకవర్గం సమస్యల దుర్గం



రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనకు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న పలు ప్రధాన సమస్యల పరిష్కారానికి, కీలక ప్రాజెక్టులకు సీఎం నిధులివ్వాలని ప్రజలు ఆశిస్తున్నారు. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతుభరోసా, పింఛన్ల పెంపు, నియోజకవర్గానికో డిగ్రీ కళాశాల, మండలానికి ఓ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాల ని డిమాండ్ చేస్తున్నారు.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

▸ ఏడాది పూర్తయిన కాంగ్రెస్ పాలన ▸ హామీల అమలుకు ప్రజల విన్నపం

ఉమ్మడి జిల్లాలో పరిశ్రమలు అధికంగా ఉండడం, కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్న నేపథ్యంలో నార్కట్‌పల్లి సమీపంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. మిర్యాలగూడలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఉన్నా సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పూర్తిస్థాయి ఆసుపత్రిని ఏర్పాటు చేస్తే కార్మికులకు, వారి కుటుంబాలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

పెండింగ్ రుణమాఫీని పూర్తిచేయాలి

రుణమాఫీ పథకం అమలులో భాగంగా బ్యాంకుల్లో సాంకేతిక కారణాలతో పలువురు రైతులకు మాఫీ వర్తించలేదు. ఈ పెండింగ్ రుణమాఫీ పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. పట్టాదా రు పాస్‌పుస్తకం, బ్యాంక్ అకౌంట్‌లో తప్పులు, కుటుంబం ఫొటో లేదని, జాయింట్ అకౌంట్ వంటి పలు సాంకేతికకార ణాలతో చా లామంది రైతులకు అర్హత ఉన్నా రుణమాఫీ పొందలేకపోయారు. ఇలాంటి కేసులన్నింటినీ పునఃపరిశీలించి రుణ మాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

పెండింగ్ పనులపై దృష్టిసారించాలి

నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి ఇటీవల రూ.44కోట్లతో మంజూరైన మూడు ఎత్తిపోతల పథకాల పనులను వేగంగా పూర్తిచేసి, వచ్చే వానాకాలానికి నీరివ్వాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు లైనింగ్‌కు నిధులివ్వాలని, తద్వారా అన్ని డిస్ట్రిబ్యూటరీలకు నీరంది రైతులకు రెండు పంటలు పండించుకునేందుకు ఇబ్బంది ఉండదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా నల్లగొండ పట్టణంలో కళాభారతి నిర్మాణాన్ని చేపట్టాలని, ఐటీ హబ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, ఎంజీయూలో టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరుతున్నారు. బత్తాయి మార్కెట్, పట్టణంలోని సమీకృత మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, పట్టణ సమీపంలో బైపాస్‌పై నిర్మిస్తున్న ఓవర్‌బ్రిడ్జిని తక్షణమే పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

- మునుగోడు నియోజకవర్గంలో రీజనల్ రింగురోడ్డు కింద భూనిర్వాసితులకు పరిహారం పెంచాలని కోరుతున్నారు. నియోజకవర్గానికి సాగు, తాగునీటిని అందించే డిండి ఎత్తిపోతల పథకం పనులు వేగంగా పూర్తిచేసి ఫ్లోరైడ్ పీడను విరగడ చేయాలని కోరుతున్నారు. చండూరులో ఏర్పాటైన రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి రెగ్యులర్ ఉద్యోగులను కేటాయించడంతో పాటు, డివిజన్‌ను అమలులోకి తీసుకురావాలని, 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. చౌటుప్పల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.
- నకిరేకల్ నియోజకవర్గంలో.. నియోజకవర్గానికి సాగునీటి ఆధారమైన మూసీ కాల్వలు పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలకు పూర్తికి నిధులివ్వాలని కోరుతున్నారు. అయిటిపాముల ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో అర్ధాంతరంగా నిలిచిన వంద పడకల ఆసుపత్రి భవనాన్ని పూర్తిచేయాలని, నార్కట్‌పల్లి బస్‌డిపో బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చెర్వుగట్టు ఆలయానికి రెండో ఘాట్‌రోడ్డును నిర్మించేందుకు నిధులివ్వాలని విన్నవిస్తున్నారు. రామన్నపేటలో నిర్మించతలపెట్టిన అంబూజా సిమెంట్ పరిశ్రమను ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు.
- మిర్యాలగూడ నియోజకవర్గంలో.. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఐదు ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజురు చేసి వాటిని

మిగతా 4వ పేజీలో



లక్ష మందితో సీఎం బహిరంగ సభ

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నల్లగొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాది నిండుతున్న సందర్భంగా జిల్లా కేంద్రం సమీపంలో ఎస్ఎల్‌బీసీ వద్ద ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల పక్కన లక్ష మందితో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నిర్వహిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈనెల 7న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల నిమిత్తం రానుండగా, ఏర్పాట్లను మంత్రి గురువారం పరిశీలించారు. వైద్య కళాశాల నూతన భవనాల వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం పర్యటనలో భాగంగా సుమారు రూ.1000కోట్లతో చేపట్టిన బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ చానల్స్ ప్రారంభిస్తారని తెలిపారు. 2008లో వైఎస్ హయాంలో ఈ పనులు మంజూరు కాగా, 80శాతం పూర్తయ్యాయని, గత ప్రభుత్వం ఈ పనులను పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు పూర్తిచేశామని తెలిపారు. బ్రాహ్మణవెల్లెంల ద్వారా సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని, భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ పనులకు సైతం సీఎం రూ.4,540కోట్లు మంజూరు చేశారని, అమెరికా నుంచి బోరింగ్ యంత్రం పరికరాలు రానున్నాయని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పూర్తయితే 4,000 నుంచి 6,000 క్యూసెక్కుల నీటితో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సీఎం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో యూనిట్-2లో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి ఎస్ఎల్‌బీసీ గంధంవారిగూడెం వద్ద రూ.275కోట్లతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడే రూ.40కోట్లతో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన చేస్తారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించి, గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని, కనగల్, తిప్పర్తి మండలాలకు మంజూరైన జూనియర్ కళాశాలలకు కూడా శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే నార్కెట్‌పల్లి, దామరచర్ల మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరు చేస్తూ డిసెంబరు 9 తర్వాత జీవో రానుందని వెల్లడించారు. ఎల్లారెడ్డిగూడెం వద్ద రూ.10కోట్లతో టూరిజం ద్వారా హరిత హోటల్ నిర్మిస్తున్నామన్నారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసాను సీఎం ప్రకటించనున్నారని....

- మిగతా 4వ పేజీలో...

నేడు జిల్లాకు

మంత్రుల రాక

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

4

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా

చర్యలు తీసుకోవాలి

మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ

4

మెడికల్ కళాశాల వద్ద

బీఆర్ఎస్ నేతల అరెస్ట్

గత ప్రభుత్వ పనులు కొనసాగించాలి : కంచర్ల

తూనికలు, కొలతలపై అవగాహన ఉండాలి

లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సిద్దార్థ్




తూనికలు, కొలతపై అవగాహన కల్పిస్తున్న సిద్దార్థ్

నల్లగొండ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలపై అవగాహన ఉండాలని, మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని లీగల్ మెట్రాలజీ నల్లగొండ జోన్ అసిస్టెంట్ కంట్రోలర్ కె.సిద్దార్థ్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు ఉపయోగించే తూకపు రాళ్లు, యంత్రాల ద్వారా ఎలా మోసాలకు పాల్పడుతున్నారో వివరించారు. ఆహార పదార్థాల ప్యాకెట్లపై తయారీదారుడి చిరునామా, బరువు, ప్యాక్ చేసిన తేదీ, గరిష్ఠ ధర, కస్టమర్‌కేర్ చిరునామా ముద్రించి ఉండాలన్నారు. తూకాల్లో మోసాలపై వినియోగదారులు 9440575081 నెంబర్‌కు ఫిర్యాదు చేయలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారి పి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులు, పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



పంటను పరిశీలించి మహిళా రైతుతో మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్

మర్రిగూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు పంట భూముల భూసార పరీక్ష చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ మృత్తికా (నేల) దినోత్సవం సందర్భంగా మండలంలోని రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు భూసార పరీక్షలు చేయించుకొని పచ్చిరొట్ట ఎరువులు, పశువుల పేడ, ఇతర సేంద్రీయ ఎరువులను ఉపయోగిస్తూ భూసారాన్ని పెంచాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని కోరారు. మర్రిగూడ, తమడపల్లి గ్రామాల్లో రైతుల వ్యవసాయ భూముల వద్దకు వెళ్లి మట్టి నమునాలు ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. యాసంగిలో సాగుచేయాల్సిన పంటలపై రైతులతో చర్చించారు. ఆయన వెంట ఏవో పి.మల్లేష్, ఏఈవో పి.విజయ్‌కుమార్, నాగస్వాతి, తదితరులు ఉన్నారు.

నేడు చీఫ్ మినిస్టర్ కప్ కోఆర్డినేషన్ మీటింగ్

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చీఫ్ మినిస్టర్ కప్ కోఆర్డినేషన్ సమావేశం శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో సాయంత్రం 3గంటలకు నిర్వహించనున్నట్టు డీఎస్‌వైవో కుంభ నర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయ, అంతర్జాతీ క్రీడల్లో రాణించేలా గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను ఎంపిక చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఈ టోర్నమెంట్‌కు సంబంధించి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశామని, ఒలంపిక్స్ అసోసియేషన్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

యాసంగికి ప్రణాళికలు

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలకు అధికారుల సన్నాహాలు

డిసెంబరు 10 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 15 వరకు

వారబందీ పద్ధతిలోనే నీటి విడుదల ఉంటుందన్న ఎన్నెస్పీ అధికారులు

యాసంగి సాగుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం జిల్లాలోని ప్రాజెక్ట్‌ల ద్వారా నీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్ట్‌లైన నాగార్జున సాగర్, మూసీల నుంచి నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. డిసెంబరు 10వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు వారబందీ పద్ధతిలో నీటి విడుదల ఉంటుందని నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ అధికారులు పేర్కొంటున్నారు. మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో యాసంగి సాగుకు నీటిని అందించేందుకు ప్రణాళికను అధికారులు ఖరారుచేశారు. ఈ నెల మూడోవారం నుంచి ప్రాజెక్టు పరిధిలోని 30వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించనున్నారు. ఆన్ ఆఫ్ పద్ధతిలో వచ్చే ఏడాది ఏప్రిల్ రెండో వారం వరకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

5



రైతు భరోసాను విడుదల చేయాలి

మంత్రి తుమ్మలకు డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి



మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు వెంటనే రైతుభరోసా నిధులు విడుదల చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు రైతుభరోసాగా ఎకరాకు రూ.7500 చొప్పున ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించడంతో రైతులంతా ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఈ నిధులను త్వరితగతిన విడుదలకు కృషి చేయాలని కోరారు. సంక్రాంతి తరువాత రైతు భరోసా అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారన్నారు. ఈ నిధులు విడుదల అయితే రైతులకు పెట్టుబడి సాయంగా ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద మొత్తంలో రుణమాఫీ జరిగిందని, సహకార బ్యాంకుల్లోని రైతుల రుణాలు కూడా మాఫీ చేయడం సంతోషకరమన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

పసి ప్రాణం తీసిన 'పంచాయితీ'

- భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు
- భర్తపై కోపంతో కుమారుడిని బావిలోకి తోసి దూకిన తల్లి
- బాలుడు మృతి.. తల్లిని రక్షించిన స్థానికులు

5

వలపు వల కిలేడీ కోసం వెతుకులాట

డీ-8, 9 ఎత్తిపోతల ట్రయల్ రన్ విజయవంతం



ఎత్తిపోతల ట్రయల్ రన్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ లోలెవల్ కెనాల్ ద్వారా డీ-8, 9 కాల్వలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ విజయవంతమైంది. గురువారం నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజనీర్లుతో కలిసి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ఈ ట్రయల్‌రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు కాల్వల్లో పారుతున్న సాగునీటిని పరిశీలించారు. ఈ నెల చివరి నాటికి ఈ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించి సుమారు 7,150 ఎకరాలకు సాగునీటిని అందిస్తామని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనులు నిలిచిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే విజయవంతంగా పనులు పూర్తి చేశామన్నారు. ఈ పథకం ద్వారా కుంకుడుచెట్టుతండా, గాత్‌తండా, తూటిపేటతండా, పాశంవారిగూడెం, రంగుండ్ల, జానారెడ్డికాలనీ, ఎల్లాపురంతండా గ్రామాలకు సాగునీరు అందజేయనున్నట్టు తెలిపారు. వారి వెంట డీఈలు నాగయ్య, వేణు, ఏఈఈలు రవిరాజా, ఖదీర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, నాయకులు పగడాల నాగరాజు, మెరావత్ మునినాయక్, అనుముల అంజి, లాలునాయక్, కుర్ర శంకర్‌నాయక్, భాస్కర్‌నాయక్, బాలునాయక్, సర్దార్‌నాయక్, చందు, పాండునాయక్, శంకర్‌నాయక్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

దేవరకొండ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అనిత

దేవరకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దేవరకొండ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత అధికారులను ఆదేశించారు. దేవరకొండ పట్టణ శివారు పెంచికల్‌పహడ్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న దేవరకొండ మున్సిఫ్‌కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అనిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రవీందర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి హరీష్‌బాబు గురువారం రాత్రి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న భోజనం వివరాలను విద్యార్థులతోపాటు వసతి గృహ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, స్టోర్‌రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత

సీపీఎం మండల కార్యదర్శిగా వినోద్‌నాయక్


వినోద్‌నాయక్

దామరచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యదర్శిగా మండలానికి చెందిన మాలోతు వినోద్‌నాయక్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిర్యాలగూడ పట్టణంలో ఇటీవల నిర్వహించిన సీపీఎం జిల్లా 21వ మహాసభలో వినోద్‌నాయక్‌ను మండల కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన జిల్లా, మండల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

జిల్లా కమిటీ సభ్యుడిగా శ్రీను

నిడమనూరు: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా మండలంలోని సూరెపల్లి గ్రామానికి చెందిన సీనియర్ సీపీఎం నాయకుడు కొండేటి శ్రీను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిర్యాలగూడలో జరిగిన పార్టీ జిల్లా మహాసభల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంత్యక్రియలకు అవస్థలే


హిందూ శ్మశాన వాటిక(మహాప్రస్థానం

- పట్టణానికి సరిపడా లేని శ్మశానవాటికలు
- పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాని మహాప్రస్థానం
- నిర్వహణ బాధ్యత మోస్తున్న కాంట్రాక్టర్

(మిర్యాలగూడ టౌన్ - ఆంధ్రజ్యోతి): పుట్టిన వారు గిట్టక తప్పదన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే గిట్టిన వారికి నిర్వహించే అంత్యక్రియలకు అవస్థలు పడాల్సిన పరిస్థితి మిర్యాలగూడ పట్టణంలో ఉంది. పట్టణంలోని హిందూ శ్మశానవాటికలు షాబూనగర్, గాంధీనగర్(ఎస్సీ), బాపూజీనగర్, ఈదులగూడ(రాంనగర్ బంధం)లలో ఉండగా, వినోభానగర్‌లో క్రిస్టియన్ బరేల్‌గ్రౌండ్, బంగారుగడ్డలో ఖబ్రస్థాన్ ఉంది. అయితే ఆయా శ్మశాన వాటికల్లో కనీస వసతులు లేవు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న వైకుంఠధామాలు పార్కులను తలపిస్తుండగా పట్టణంలోని పలు శ్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని కారణాలెన్నో..!

శ్మశానవాటికల అభివృద్ధికి స్థల వివాదం ప్రధాన సమస్యగా కాగా నిధుల కొరత ద్వితీయస్థానానిది. పట్టణంలోని బాపూజీనగర్ శ్మశానవాటిక స్థలం ఆక్రమణలకు గురైందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఆ స్థలంపై వివాదాలు, కోర్టు కేసులున్నాయి. గాంధీనగర్‌లోని శ్మశానవాటిక (ఎస్సీ బరేల్ గ్రౌండ్) ప్రహరీ స్థలం వివాదంలో ఉండగా స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమస్యను పరిష్కరించారు. రూ.20కోట్ల నిధులతో అంచనాలతో అనుమతి పొంది మూడేళ్ల క్రితం ఆరంభించిన పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. కుటుంబ సభ్యులు, బంధువులను కడసారి చూపేందుకు వచ్చిన బంధుమిత్రులు ఆయా శ్మశానవాటికల్లో అరకొర వసతుల నడుమ తూతూమంత్రంగా అంత్యక్రియలు నిర్వహించే పరిస్థితి ఉండకూడదని, ప్రశాంత వాతావరణంలో నిశ్చల మనసుతో దహన సంస్కారాలు, అంత్యక్రియలు జరిగేలా శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

మహాప్రస్థానం సేవలెప్పుడు?

మిర్యాలగూడ పట్టణంలోని షా బూనగర్ హిందూ శ్మశానవాటికను మహాప్రస్థానం పేరు తో అభివృద్ధి చేశారు. 2023లో రూ.5.05 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు శరవేగంగా జరిగాయి. అయితే సంవత్సరాంతంలో అసెంబ్లీ ఎన్నికలు రావ డం, ప్రభుత్వం మారడం జరిగింది. అప్పటికి 90శాతం పనులు పూర్తయిన ట్లు అధికారులు తెలిపారు. అయితే ఇందులో ఎలక్ట్రికల్ క్రిమేషన్ యూనిట్, జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు సుమారు రూ. 55 లక్షలవుతుందని ప్రతిపాదలను రూపొందించా రు సంబంధిత అధికారులు. ఇప్పటికే అంచనా వ్యయానికి అదనంగా రూ. 70 లక్షలు వెచ్చించింది గుత్తేదారు సంస్థ. సుమారు అయిదున్నర కోట్ల రూపాయల పనులు పూర్తయినా బిల్లులేవీ విడుదల కాకపోవడంతో మహాప్రస్థానంలో పూర్తి స్థాయి సేవలందడం లేదు. రాష్ట్రరాజధాని తరహాలో ఆధునిక హంగులతో, పచ్చని పచ్చిక బయళ్లతో అత్యాధునికంగా నిర్మించిన మహాప్రస్థానంను అందుబాటులోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కాంట్రాక్టరు నిర్వహణలోనే..

అత్యాధునికంగా అభివృద్ధి చేసిన మహాప్రస్థానాన్ని మునిసిపాలిటీ హ్యాండోవర్ చేసుకోవాల్సి ఉంది.అయితే నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారు సంస్థనే నిర్వహణ బాధ్యతను మోస్తోంది. గుత్తేదారు చేసి హ్యాం డో వ ర్ చేసుకోవాల్సి గతేడాది అసెంబ్లీ ఎన్నికల కో డ్‌తో పనులు నిలిచిపోగా అప్పటి నుంచి నిర్వహణంతా సదరు సంస్థే చేపడుతోంది. స్మశాన వాటికలో విధులు నిర్వహించే వాచ్‌మెన్, వర్కర్ల వేతనాల నుంచి మొక్కల పెంపకం వరకు, విద్యుత్ బిల్లుల చెల్లింపుతో కలిపి నె లకు సుమారుగా లక్ష రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని కాంట్రాక్టరు వాపోతున్నాడు.

బిల్లులు చెల్లించి స్వాధీనం చేసుకోవాలి

దుఃఖంలో ఉన్న వారు ఇబ్బంది పడవద్దనే తలంపుతో పనులు వేగంగా పూర్తి చేశాం. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ నాటికే దాదాపు పనులు పూర్తయినా నేటికీ బిల్లులు విడుదల కాలేదు. అప్పటి నుంచి నిర్వహణ బాధ్యత మేమే మోస్తున్నాం. పనుల నిర్వహణలో ఎక్కడా రాజీ పడలేదు. అంచనా వ్యయానికి అదనంగా రూ. 70 లక్షలు ఖర్చయింది. విద్యుత్ బిల్లుల చెల్లింపు, సిబ్బంది వేతనాలు నెలకు సుమారుగా లక్ష ఖర్చవుతోంది. మునిసిపాలిటీ త్వరితగతిన బిల్లులు చెల్లించి స్వాధీనం చేసుకోవాలి. అదనంగా చేసిన పనులకు ఇంజనీర్లతో అంచనా వేయించి బిల్లులు విడుదల చేయాలి.

- శ్రీధర్, కాంట్రాక్టరు,మిర్యాలగూడ

శ్మశానవాటికలను అభివృద్ధి చేస్తున్నాం



వైకుంఠధామాల అభివృద్ధి, నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణ పరిధిలోని అన్ని శ్మశానవాటికలను అభివృద్ధి చేస్తున్నాం. అందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. ఆధునిక హంగులతో అభివృద్ధి చేసిన హిందూ శ్మశానవాటిక మహాప్రస్థానాన్ని త్వరలో స్వాధీనం చేసుకుంటాం. నిధుల కొరత ఉన్నందున ఉన్నతాధికారులను నివేదికలు పంపుతున్నాం.

● యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ప్రభుత్వానివి కక్ష సాధింపు చర్యలు

● మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యేలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుల అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడమేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అక్రమ కేసులకు భయపడేది లేదని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

నిడమనూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం కచ్చితంగా నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ జంగాల కృష్ణయ్య ఆదేశించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వసతి గృహంలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. హాస్టల్‌లోని వంట గది, స్టోర్ రూమ్‌ను, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. వంటలకు నాణ్యమైన సరుకులు, తాజా కూరగాయలు వినియోగించాలని హాస్టల్ ఇన్‌చార్జికి సూచించారు. వసతిగృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. భోజనంలో మెనూ పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విద్యార్థులు కూడా పరిశుభ్రత పాటిస్తూ, ఉన్నతమైన విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈవో లావూరి వెంకన్న, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గౌతమ్, కేర్ టేకర్ రాజేశ్వరి ఉన్నారు.

తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గం ఎన్నిక


రాందాస్‌నాయక్

దామరచర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలో జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా బాణావత్ స్కైలాబ్‌నాయక్, అధ్యక్షుడు గుగులోతు రాందాస్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రమావత్ బాలునాయక్, ఉపాధ్యక్షులు ఎల్.హరికిషన్, ఆర్.బుజ్జి, కోశాధికారి హరి, కార్యదర్శులు ఎన్.బాబునాయక్, బాబ్లునాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ మండలంలో సంఘం బలోపేతానికి తమవంతుగా కృషి చేస్తామని, తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాఆనవత్ సైదులు నాయక్, తిరుపతినాయక్, బాషానాయక్, కొర్ర కృష్ణకాంత్‌నాయక్ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం


సమావేశంలో మాట్లాడుతున్న డబ్బీకార్ మల్లేష్

మిర్యాలగూడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతమయ్యాయని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రాజకీయ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సభలు విజయవంతానికి సహకరించిన వారికి ప్రజా సంఘాల బాధ్యులకు, వలంటీర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వీఎన్ ఆశయాలు సాధించాలి

వీఎన్ ఆశయాలను సాధించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లేష్ అన్నారు. మల్లు వెంకటనర్సింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, భవాండ్ల పాండు, మల్లు గౌతంరెడ్డి, అయూబ్, పాదూరి శశిధర్‌రెడ్డి, రెమిడాల పరశురాములు, తిరుపతి రాంమూర్తి, వాడపల్లి రమేష్, అరుణ, లక్ష్మి నారాయణ, పతాని శ్రీను, చారి, సంపత్ పాల్గొన్నారు.

భూసార సంరక్షణతో అధిక దిగుబడి


సమావేశంలో మాట్లాడుతున్న కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి

మిర్యాలగూడ, వేములపల్లి, గుర్రంపోడు, పెద్దవూర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వాడకంతో నేల మరింత సారవంతమవుతుందని, పంట పొలాల్లో భూసారాన్ని సంరక్షించుకోవడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అన్నారు. ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం సందర్భంగా వ్యవశాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని పలు మండలాల్లోని రైతువేదికల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. భూమి పైపొర కోత వలన సారం తగ్గి పంటల దిగుబడులు తగ్గే అవకాశం ఉందని అన్నారు. రైతులు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు ఉపయోగించడం వల్ల భూమిలోని మృత్తికలు మరింతగా తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఎరువుల వాడకంలో మెళకువలను తెలుసుకోవాలని అన్నారు. పచ్చిరొట్ట, పశువుల ఎరువు వినియోగించడం వల్ల భూమి తిరిగి సారవంతమవుతుందని అన్నారు. రైతులు ప్రతి సంవత్సరం పంట సాగుకు ముందు భూసార పరీక్షలను నిర్వహించుకొని భూములోని లోపాలను గుర్తించి అందుకు అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు.

● మిర్యాలగూడ రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, ఏడీఏ పోరెడ్డి నాగమణి పాల్గొని మాట్లాడారు. కల్తీ విత్తనాలను అరికట్టి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు, ఏవో సైదానాయక్, ఏఈవోలు పాల్గొన్నారు.

● వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం, రావులపెంట రైతువేదికల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏవో రుషేంద్రమణి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈవోలు నితిన్, రమేష్, మల్సూర్, పీఏసీఎస్ చైర్మన్ నక్క శేఖర్, సీఈవో సైదులు, రైతులు సుధాకర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, నాగయ్య పాల్గొన్నారు.

● గుర్రంపోడు మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో ఏవో మాధవరెడ్డి మాట్లాడుతూ నేలను కలుషితం కాకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జితేందర్‌గౌడ్, రైతులు మండలి లింగయ్య, సయ్యద్‌మియా, వడ్డెగోని సైదులు, రావుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవూర మండల కేంద్రంలోని రైతువేదికలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. మృత్తికా సంరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవో సందీప్, ఏఈవోలు ఆంజనేయులు, మధుకర్, స్వాతి, శారద పాల్గొన్నారు.

బాల్యవివాహాల నియంత్రణకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సక్కుబాయి

చింతపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నియంత్రణకు కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి అన్నారు. ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ, జడ్పీహెచ్ఎస్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఎవరైనా బాల్య వివాహం చేస్తే సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. బాలికల సంరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు పార్వతి, యశోద, అంజమ్మ, సఖి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి


విద్యార్థులను పరామర్శిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

దేవరకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల ఆంజనేయులు, ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గోపిచంద్ డిమాండ్ చేశారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులను గురువారం వారు పరామర్శించి మాట్లాడారు. నాణ్యత లేని బియ్యం సరఫరా చేయడం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజన్‌తో రాష్ట్రంలో విద్యార్థులు మృతి చెందుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వారి వెంట ఏబీవీపీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు రమేష్, సిద్దార్థ తదితరులు ఉన్నారు.

మేము వెళ్లిపోతాం.. మా కూలి మాకు ఇవ్వండి

● ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కూలీల రాస్తారోకో


కాటన్ మిల్లు వద్ద రాస్తారోకో చేస్తున్న కూలీలు

కొండమల్లేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూలి డబ్బుల కోసం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి కూలీలు ధర్నా నిర్వహించారు. గురువారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి వద్ద ఉన్న కాటన్ మిల్లు వద్ద ఈ సంఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి వద్ద ఉన్న పత్తి మిల్లులో పనిచేసేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుమారు 40 మంది కూలీలు రెండు నెలల క్రితం ఇక్కడకు వచ్చారు. బుధవారం రాత్రి సుమారు 15 మంది కూలీలకు మిల్లు యజమాని రూ.8వేలు కూలి డబ్బులు చెల్లించాడు. అయితే కూలి డబ్బులు తీసుకున్న వారు యజమానికి చెప్పకుండా రాత్రికిరాత్రే సొంత రాష్ట్రానికి వెళ్లిపోయారు. దీంతో మిగిలిన కూలీలు కూడా తమకు మిల్లులో పనిచేయడం ఇష్టం లేదని, మేము వెళ్లిపోతాం, మా కూలి డబ్బులు మాకు ఇవ్వాలని యజమానిని అడిగారు. డబ్బులు ఇవ్వగానే వెళ్లిపోతే పనులు ఆగిపోతాయని పని పూర్తయ్యాక ఇస్తానని యజమాని చెప్పాడు. దీంతో 25మంది కూలీలు తమకు రావాల్సిన కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మిల్లు ఎదుట జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై అర్ధగంట ధర్నా చేయటంతో కిలోమీటరు మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు కూలీలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి నచ్చజెప్పారు. పనులు పూర్తయ్యాక కూలి డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో వారు యథావిధిగా పనులకు వెళ్లిపోయారు.

సంక్షిప్త సమాచారం...

'మామ్నూరు విమానశ్రయానికి సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టాలి'

తిరుమలగిరి(సాగర్), దామరచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న మామ్నూరు విమానశ్రయానికి లంబాడీల అరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టాలని టీఆర్‌జీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్, ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ అన్నారు. రానున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై ప్రభుత్వం తీర్మానం చేయాలని కోరారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

హాలియా, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనుముల మండలంలోని వీరసేన, కేజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ఆదేశానుసారం అనుముల మండలంలోని బీసీ, ఎస్సీ, మైనార్టీ, గురుకుల, కస్తూర్బా, సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న సుమారు 2200మంది విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ మాట్లాడుతూ చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపాలిటీ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, కౌన్సిలర్ పిల్లి ఆంజనేయులు, నాయకులు సైదులు, పాండునాయక్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వాములకు అన్నసమారాధన

హాలియా, డిసెంబరు 5: హాలియా మునిసిపాలిటీలోని రామాలయంలో అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో స్వాములకు నిర్వహిస్తున్న అన్నసమారాధనలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ సతీమణి భవానితో కలిసి పాల్గొన్నారు. అయ్యప్పస్వామి మాలధారణ ఇరుముడి ధరించి శబరిమలై బయలుదేరి వెళ్లారు. బుధవారం రాత్రి అయ్యప్పస్వామి మహాపూడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భగత్ మాతృమూర్తి నోముల లక్ష్మి, అయ్యప్ప, ఆంజనేయ, దత్తాత్రేయ, భవానీ, తదితర మాలధారులు పాల్గొన్నారు.

క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

చింతపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంసీసీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మాల ధరించిన స్వాములకు అన్నదానం చేశారు. గురుస్వామి రాములు మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నర్సింహ

హాలియా, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ అనుముల మండల అధ్యక్షుడిగా కరెడ్ల నర్సింహ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హరిప్రసాద్

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రూపావత్ హరిప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి, యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా నకిరేకంటి భాస్కర్, పట్టణ అధ్యక్షుడిగా షేక్ పర్వేజ్ ఎన్నికయ్యారు.

ఎస్టీలకు మంత్రి పదవి ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్టీలకు మంత్రి పదవి ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి ధీరావత్ కోట్యానాయక్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గిరిజన జనాభా అధికంగా ఉందని, అన్ని రంగాల్లోనూ ఎస్టీలు సేవలందిస్తున్నారన్నారు. ఎస్టీలను నామినేటెడ్ పోస్టులకు పరిమితం చేయకుండా మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణనాయక్, నాగరాజు, వెంకటయ్య అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్ ఏర్పాటుపై హర్షం

మాడ్గులపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్నమాదిగ అన్నారు. మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించే మాదిగ మహిళ శక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పట్టణ అభివృద్ధికి సమగ్ర చర్యలు

యూసుఫ్, కమిషనర్, మిర్యాలగూడ



మిర్యాలగూడ మునిసిపాలిటీలో పరిశుభ్రత, పచ్చదనానికి అధిక ప్రాధాన్యతనిస్తూనే ప్లాస్టిక్ నిషేధ అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎండీ. యూసుఫ్‌ను తెలిపారు. పట్టణ అభివృద్ధికి సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలో చేపట్టే పనుల గురించి బుధవారం ఆయన ఇంటర్వ్యూతో మాట్లాడారు.

- (మిర్యాలగూడటౌన్, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: పట్టణాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?

కమిషనర్: పట్టణాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా పార్కుల ఏర్పాటు, పచ్చదనం పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం. శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో తాగునీటి కొరత ఉందా..?

కమిషనర్: మంచినీటి కొరత పెద్దగా లేదు. పట్టణ జనాభా పెరుగుతుండగా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూ. 93.40 కోట్లతో అమృత్-2 ప్రాజెక్టు నిర్మిస్తున్నాం. అది పూర్తయితే నీటి కొరత ఉండదు.

ఆంధ్రజ్యోతి: అంతర్గత డ్రైనేజీ పనితీరెలా ఉంది..?

కమిషనర్: అమృత్, పబ్లిక్ హెల్త్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పునఃప్రారంభించాం. రూ. 173 కోట్ల నిధులతో చేపట్టిన పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పనుల నిర్వహణ బాధ్యతంతా ఇరు శాఖలే చేసుకుంటాయి. మా పర్యవేక్షణ ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: డంపింగ్ యార్డు నిర్వహణ ఎలా ఉంది..?

కమిషనర్: పట్టణంలో రోజు 50 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ఆరున్నర ఎకరాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో ప్రస్తుతం వెలువడుతున్న వ్యర్థాలకు సరిపోవడం లేదు. యార్డు ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు లేఖ రాశాం. అప్పటి వరకు వ్యర్థాలను ధ్వంసం చేసేందుకు బయోమైనింగ్ విధానం అమలు చేయనున్నాం. ఈ విధానంతో దుర్వాసన రాదు, కాలుష్యం వెలువడదు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులైన మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఎస్‌వో ఎస్. ప్రవళిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ పండిట్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఎంపికైన వారు ప్రస్తుత విద్యా సంవత్సరానికి మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళ అభ్యర్థులు రెండు రోజుల్లో పీఏపల్లి కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

హనుమద్గాయత్రి మహాయజ్ఞం రేపు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుడిపల్లి మండలంలోని చిలకమర్రి గేట్ వద్ద శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 7వ తేదీ శనివారం ప్రథమ హనుమద్గాయత్రి మహాయజ్ఞం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పబ్బతి ఆంజనేయస్వామి దేవస్థానం కమిటీ గురువారం తెలిపారు. శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉమ్మడి మండలంలోని ఆంజనేయ, అయప్ప భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.